ఏలూరు **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 42.0
కనిష్ఠం : 25.0

వైఎస్ షర్మిల పర్యటన వాయిదా

ఏలూరు రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల సోమవారం ఏలూరు జిల్లా పర్యటనకు రావాల్సి ఉండగా వాయిదా పడింది. ఆదివారం కురిసిన భారీ వర్షాలకు ఏలూరు రూరల్ మండలం పాలగూడెంలో వరి రైతులకు నష్టం వాటిల్లింది. ధాన్యం బస్తాలు తడిసిపోయిన నేపథ్యంలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల బాధిత రైతులను పరామర్శించేందుకు రానున్నట్టు ఆదివారం ప్రకటన వెలువడింది. అయితే అనివార్య కారణాల వల్ల పర్యటన వాయిదా పడినట్టు ఏలూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు రాజనాల రామ్మోహనరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16వ తేదీన ఏలూరులో జిల్లా కాంగ్రెస్ పార్టీ సర్వసభ్య సమావేశం జరగనుందని, ఈ సమావేశానికి షర్మిల హాజరు కానున్నారని తెలిపారు.



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి

» నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా

నూజివీడు టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): నష్టపోయిన విత్తన మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని కోరుతూ నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం కౌలురైతుల సంఘం ఆధ్వర్యంలో రైతులు ధర్నా నిర్వహించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ నూజివీడులో మొక్కజొన్న విత్తన కంపెనీలు, రైతులను తీవ్రంగా నష్టపరుస్తున్నాయన్నారు. వ్యవసాయ అధికారులు తమకు సంబంధం లేనట్టు వ్యవహరిస్తున్నారని, మంత్రి కొలుసు పార్థసారథి తక్షణం రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఒక్క నూజివీడు మండలం బోర్వంచలోనే 68 ఎకరాల్లో ఓ సీడ్స్ కంపెనీ ఇచ్చిన విత్తనాలతో రైతులు నష్టపోయారన్నారు. సీపీఐ నాయకుడు నిమ్మగడ్డ నరసింహ, రైతుసంఘం నాయకులు రాయంకుల లక్ష్మణరావు, మడుపల్లి నాగేంద్రరావు, నాగేశ్వరరావు, రంగారావు, బాధిత రైతులు పాల్గొన్నారు.

నరసాపురం బ్యాంక్‌లో స్కాం!



- నాలుగేళ్ల క్రితం చనిపోయిన రైతు భూమిని చూపించి ఏడాది క్రితం నాలుగు కోట్ల రుణాలు
- రుణం తీసుకునేందుకు వారసులు వెళ్లడంతో వెలుగు చూసిన భారీ మోసం
- ఇప్పటికే మీ భూమిపై రుణం తీసుకున్నారన్న బ్యాంకు అధికారులు
- అవాక్కయ్యి.. నిలదీసిన హక్కుదారులు..
- రాత్రి వరకు ఉద్రిక్తత
- పోలీసుల విచారణ.. నిబంధనల ప్రకారం చేశామన్న మేనేజర్ ప్రకాశ్

నరసాపురం, మే 5 (ఆంధ్రజ్యోతి): నరసాపురం సెంట్రల్ బ్యాంకులో భారీ రుణ కుంభకోణం వెలుగు చూసింది. రైతులకు తెలియకుండా లీజు అగ్రిమెంట్లను సృష్టించి.. ఇద్దరు వ్యక్తులు బ్యాంకులో రూ.4 కోట్ల రుణం తీసుకున్నారు. లీజుకు ఇచ్చారని చెబుతున్న వారిలో ఓ రైతు నాలుగేళ్ల క్రితం చనిపోయారు. గత ఏడాది చనిపోయిన ఈ రైతు లీజుకు ఇచ్చినట్లు పత్రాలు సృష్టించారు. సోమవారం అసలు రైతులు బ్యాంకుకు వెళ్లి రుణం తీసుకునేందుకు పత్రాలు ఇవ్వగా.. ఈ భాగోతం వెలుగుచూసింది. దీంతో బ్యాంకు అధికారులను రైతులు నిలదీశారు. ఐదు గంటలపాటు బ్యాంకులో ఉద్రిక్తత నెలకొంది. చివరికి పోలీసులు విచారణ చేపట్టారు. అయితే మేనేజర్ ప్రకాశ్ అంతా నిబంధనల ప్రకారమే రుణం ఇచ్చామని చెబుతున్నారు. వివరాలివి..

నరసాపురం మండలం వేములదీవికి చెందిన అగ్ని కుల క్షత్రియ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తిరుమాని నాగరాజు, ఆయన సోదరుడు శ్రీనివాస్, తల్లి పద్మావతి, తండ్రి వడ్డీకాసులకు 19 ఎకరాల భూమిలో చెరువులు ఉన్నాయి. నాలుగేళ్ల క్రితం వడ్డీకాసులు మృతి చెందారు. సోమవారం నాగరాజు, శ్రీనివాస్ రుణం కోసం ఓ జాతీయ బ్యాంకుకు పొలం దస్తావేజులు తీసుకువెళ్లారు. సర్వే నెంబర్లను పరిశీలించిన బ్యాంకు అధికారులు ఈ పొలాలపై నరసాపురం సెంట్రల్ బ్యాంకులో రుణాలు ఉన్నాయని చెప్పడంతో షాక్ తిన్నారు. వెంటనే ఆ బ్యాంకుకు వెళ్లి మేనేజర్ ప్రకాశ్‌ను నిలదీశారు. తమకు తెలియకుండా తమ పొలాలపై రుణం ఎలా ఇచ్చారంటూ ప్రశ్నించారు. అయితే మేనేజర్ గత ఏడాది పట్టణానికి చెందిన కూనపరెడ్డి ప్రసాద్, డి.శేఖర్ పొలాలను లీజుకు చేస్తున్నట్లు అగ్రిమెంట్లు చూపించి రూ.4 కోట్లు రుణం తీసుకున్నట్లు తెలియజేశారు. దీంతో బాధిత రైతులు షాక్ తిన్నారు. కనీసం తమ దృష్టికి తీసుకురాకుండా అంత గుడ్డిగా ఇంత పెద్ద మొత్తంలో రుణాలు ఎలా ఇచ్చారంటూ నిలదీశారు. దీంతో బ్యాంకులో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న నరసాపురం టౌన్ ఎస్ఐలు ముత్యాలరావు, జయలక్ష్మి బ్యాంకుకు చేరుకుని రికార్డులను పరిశీలించారు.



రికార్డులను పరిశీలిస్తున్న పోలీసులు

చనిపోయిన నాన్న పేరిట రుణం



మాకు వేములదీవిలో 19 ఎకరాలు భూమి ఉంది. నా పేరు, మా తమ్ముడు శ్రీనివాస్, అమ్మ పద్మ, నాన్న వడ్డీకాసుల పేరున ఈ పొలాలు ఉన్నాయి. మా నాన్న చనిపోయి నాలుగేళ్లు అయింది. మా పొలాలు, చెరువులను లీజు చేస్తున్నట్లు చూపించి రుణం తీసుకున్నారు. కనీసం రుణం ఇచ్చేటప్పుడు మా దృష్టికి బ్యాంకు అధికారులు తీసుకు రాలేదు. మృతి చెందిన మా నాన్న సంతకాలను ఫోర్జరీ చేశారు. విచారిస్తే ఎన్నో స్కాంలు వెలుగు చూస్తాయి.

-తిరుమాని నాగరాజు, వేములదీవి

ఆస్తుల్ని తాకట్టు పెట్టుకునే రుణం ఇచ్చారు



నేను బ్యాంకును, రైతులను మోసం చేయలేదు. రుణం కావాలని బ్యాంకుకు వచ్చా. వాళ్లే ఈ లీజు డాక్యుమెంట్లు అన్ని నాకిచ్చారు. నేను రైతులతో లీజుకు సంబంధించి ఎటువంటి ఒప్పందం కుదుర్చుకోలేదు. రుణం ఇప్పించడంలో మరో మధ్యవర్తి ఉన్నాడు. అతన్ని పట్టుకుని విచారిస్తే మొత్తం విషయం బయటకొస్తుంది. బ్యాంకు అధికారులు నా ఆస్తులను తాకట్టు పెట్టుకునే రుణం ఇచ్చారు. నేను ఇప్పటికే రూ.5 లక్షలు వడ్డీ కట్టా.

-కూనపరెడ్డి ప్రసాద్, వ్యాపారి

అంతా నిబంధనల ప్రకారమే..

అంతా నిబంధనల ప్రకారమే రుణం ఇచ్చాం. రైతుల పొలాలను లీజు చేస్తున్నట్లు రుణం తీసుకున్న ఇద్దరు వ్యక్తులు చూపించారు. వారిద్దరి ఆస్తులను తాకట్టు పెట్టుకునే లోన్ ఇచ్చాం. రుణం ఇచ్చేటప్పుడు చెరువులను పరిశీలించి ఇచ్చాం.

-ప్రకాశ్, మేనేజర్

ముఖం చాటేశారా.. తప్పించుకోలేరు!

- హెల్త్ ఎఫ్ఆర్ఎస్ యాప్ హాజరు నమోదులో అవకతవకలు
- ఉమ్మడి జిల్లాలో 11 మంది వైద్య సిబ్బందిపై చర్యలకు ఆదేశాలు
- 8 మంది పీహెచ్‌సీ వైద్యాధికారులే!
- ఫోన్ సెట్టింగ్స్‌తో టాంపరింగ్..వారిపై కఠిన చర్యలు

■ లోపలి పేజీలో..

శ్రీనివాస కల్యాణం.. చూతము రారండి

రేపటి నుంచి చిన వెంకన్న తిరు కల్యాణ మహోత్సవాలు

ద్వారకాతిరుమల వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం నుంచి ఈనెల 14వ తేదీ వరకు వైశాఖ మాస బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈనెల 11వ తేదీ రాత్రి 8.30 గంటలకు శ్రీవారి తిరుకల్యాణం, 12న రథోత్సవం జరగనున్నాయి. ఉత్సవాలు జరిగే రోజుల్లో నిత్యార్జిత కల్యాణాలు, సేవలు రద్దు చేశారు.



అధికారితో.. ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

జిల్లాలో విద్యుత్ సరఫరాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, వ్యవసాయ విద్యుత్, బిల్లింగ్, మీటర్ సమస్యలు, ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు, విద్యుత్ పొదుపు తదితర అంశాలపై ఈనెల 7వ తేదీ బుధవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్య 'ఆంధ్రజ్యోతి ఫోన్‌ఇన్' నిర్వహించనుంది. ప్రజలు

94408 12703

నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను తెలిపితే వాటి పరిష్కారానికి ఏలూరు జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ పి.సాల్మన్‌రాజు చర్యలు తీసుకుంటారు.



వాహనానికి జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఆరోగ్య రక్ష వాహనం ప్రారంభం

ఏలూరు, మే 5(ఆంధ్రజ్యోతి): బాలల సంపూర్ణ ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆరోగ్య రక్ష వాహనాన్ని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సోమవారం ప్రారంభించారు. కలెక్టరేట్ ఆవరణలో డీసీహెచ్ఎస్ పాల్ సతీశ్ కుమార్, డీఎంహెచ్‌వో మాలినిలతో కలిసి ఆమె ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యాన్ని కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మంచి కార్యక్రమని, పిల్లల ఆరోగ్యం పట్ల అవగాహన పెంచడానికి ఉపయోగపడుతుందన్నారు. పీహెచ్‌సీల ద్వారా గుర్తించిన లోపాలున్న పిల్లలను ఏలూరు, జంగారెడ్డిగూడెంలోని జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రాలకు తరలించేందుకు రెండు వాహనాలను సమకూర్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్, ఐసీడీఎస్ పీడీ పి.శారద, ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగాం అధికారి కె.నరేంద్రకృష్ణ, జిల్లా మేనేజర్ బి.నరేశ్ పాల్గొన్నారు.

కళ్లెదుటే గండి.. పూడ్చేదెన్నడో!



గతేడాది జూన్‌లో పెదవాగు ప్రాజెక్టుకు పడిన గండి (ఫైల్)

> రాష్ట్ర విభజన కష్టాలు ఇంకా వీడలేదు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావు పేట మండలం శివారు పెదవాగుకు గండిపడి దాదాపు ఏడాది కావస్తోంది. దీని మరమ్మతులకు ఒకవైపు ఏపీ, మరోవైపు తెలంగాణ ప్రభుత్వాలు వాటాలు వేసుకుని పనులు చేయాల్సి ఉంది. ఒకవైపు వానాకాలం దగ్గరపడుతుండగా ఇప్పటి వరకు ఆ ఊసే లేదు.

- పెదవాగు ప్రాజెక్టుకు గండిపడి ఏడాది
- తొలగని విభజన కష్టాలు
- నిధులు కేటాయింపులో జాప్యం
- ఈ వేసవిలో పనులు పూర్తి కాకుంటే మరోమారు నష్టం
- 16 వేల ఎకరాల్లో పంటలు ఆగమాగం
- రూ.15 కోట్లు ఇస్తే గండం గట్టెక్కినట్లే..

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

పోలవరం ప్రాజెక్టు ముంపు మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడు రైతులకు ఆయువుపట్టు అయిన పెదవాగు ప్రాజెక్టు మరమ్మతుల విషయంలో నిర్లిప్తత కొనసాగుతూనే ఉంది. రాష్ట్ర విభజన అనంతరం 2014 నుంచి పెదవాగు ప్రాజెక్టు నిర్వహణ విషయంలో కొంత నిర్లక్ష్యం చోటుచేసుకుంది. ఈ ప్రాజెక్టు నిర్వహణ భారం, నీటి వాటాగా అప్పట్లో ఏపీకి 82 శాతం, తెలంగాణకు 18 శాతం కేటాయింపులు ఇచ్చారు. గత జూన్‌లో భారీ వరదలకు పెదవాగు ప్రాజెక్టు కట్ట కొట్టుకుపోయి వేలాది ఎకరాలను ముంచెత్తింది. విభజన అనంతరం ఈ ప్రాజెక్టు విషయంలో నిర్లక్ష్యమే తొంగి చూస్తోంది. ప్రాజెక్టు పరిధిలో ఆయకట్టు 16 వేల ఎకరాలకు పైగా ఉంది. ఏపీ పరిధిలో 13,840 ఎకరాలు, తెలంగాణ పరిధిలో 2,260 ఎకరాల విస్తీర్ణం ఉంది. ఈ దామాషా ప్రకారం ప్రాజెక్టు నిర్వహణా భారం అత్యధికం ఏపీపైనే పడింది. ఏటా భారీ వరదలు పెదవాగు ప్రాజెక్టును ముంచెత్తుతూనే ఉన్నాయి. అప్పటికే గట్టు బలహీనంగా ఉండడం, దీర్ఘకాలికంగా మరమ్మతులు అవకాశం లేకపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తూనే వచ్చారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పట్టించుకోలేదు. ఆఖరికి నిర్వహణపై ఉమ్మడిగా సమీక్షించలేదు. తెలంగాణ ప్రాంతానికి చెందిన ప్రజాప్రతినిధులు అడపాదడపా ప్రాజెక్టు స్థితిగతులపై ఆరా తీస్తూ వచ్చారు. ఈ లోపే గత జూన్‌లో భారీ వర్షాలు, వరదలు తాకిడికి ప్రాజెక్టుకు గండిపడింది. గతేడాది పంట నష్టం రైతులు ఎదుర్కోవాల్సి వచ్చింది. కనీసం ఈ వేసవిలో అయినా గండికి మరమ్మతులు శాశ్వత ప్రాతిపదికన చేస్తారని అందరూ భావించారు. ఇప్పటికే వేసవి తుది దశకు చేరుకున్నా మరమ్మతుల విషయం పక్కన పెట్టేశారు. అధిక ఆయకట్టు ఉన్న ఆంధ్రాలోని ప్రభుత్వం స్పందించి మరమ్మతులకు నిధులు కేటాయించాలని చాన్నాళ్లుగా తెలంగాణ ప్రతినిధులు డిమాండ్ చేస్తూనే ఉన్నారు.

మరమ్మతులు చేయాలంటే..

గండిపడిన పెదవాగు ప్రాజెక్టుకు మరమ్మతుల నిర్వహణకు ఇంజనీరింగ్ విభాగం అంచనా ప్రతిపాదనలు రూపొందించింది. పూర్తిస్థాయి మరమ్మతులకు రూ.19.20 కోట్లు వ్యయం అవుతుందని తేల్చింది. ఈ లెక్కన ఏపీ తన వాటాగా రూ.15.74 కోట్లు కేటాయించాల్సి ఉంది. నిధులు విడుదల చేసి పనులకు ఇప్పటికే శ్రీకారం చుట్టి ఉండాల్సింది. కాని ఇప్పటి వరకు అధికారికంగా ఏ మేరకు నిధులు కేటాయిస్తుందీ స్పష్టతతో కూడిన ఉత్తర్వులు జారీ చేయలేదు. తెలంగాణ ప్రజాప్రతినిధు లు మరమ్మతులకు నిధుల విషయంలో పలుమార్లు ఏపీ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, నిధులు విడుదల చేయబోతున్నట్టు చెబుతూనే ఉన్నారని పేర్కొంటున్నారు. కుక్కునూరు, వేలేరుపాడు రైతులు ఈ ప్రాజెక్టే దిక్కు. అత్యధిక విస్తీర్ణం ఈ రెండు మండలాల్లోనే ఉంది. ఏపీ ప్రభుత్వం చొరవ తీసుకుని పెదవాగు ప్రాజెక్టుకు వర్షాలు పడేలోపు మరమ్మతులు నిర్వహించలేకపోతే ఈ ఏడాది పంటను అక్కడి రైతులు కోల్పోయినట్లే.

వైసీపీకి మరో షాక్

» ఏలూరు 38వ డివిజన్ కార్పొరేటర్ రాజీనామా

ఏలూరు రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత వైసీపీకి షాకుల మీద షాకులు తగులుతూనే ఉన్నాయి. తాజాగా ఏలూరు వైసీపీకి మరో షాక్ తగిలింది. ఏలూరు 38వ డివిజన్ కార్పొరేట్ తోట హేమ మాధురి వ్యక్తిగత కారణాలతో పార్టీకి రాజీనామా చేస్తూ లేఖను జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావుకు పంపించారు. అలాగే ఆమె భర్త తోట సుధీర్ పార్టీకి పదవులకు రాజీనామా చేసినట్టు ప్రకటించారు.

సత్వరం అర్జీల పరిష్కారం : కలెక్టర్



దివ్యాంగుల వద్దకే వచ్చి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి) : అర్జీదారుల సమస్యలను పరిష్కరించడమే కాకుండా వారిని గౌరవంగా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో అర్జీదారుల నుంచి 226 దరఖాస్తులు స్వీకరించారు. విభిన్న ప్రతిభావంతులు, దివ్యాంగులు వద్దకు వేదికపై నుంచి కిందికి వచ్చి కలెక్టర్ వెట్రిసెల్వి అర్జీలు స్వీకరించి, సమస్యలను విని వాటి పరిష్కార చర్యలకు సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్‌తో పాటు జేసీ ధాత్రిరెడ్డి, డీఆర్వో విశ్వేశ్వరరావు, ఆర్డీవో అచ్యుత అంబరీష్, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముక్కంటి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్ వినతులు స్వీకరించారు.

స్వేచ్ఛగా ఫిర్యాదు చేయవచ్చు : ఎస్పీ



ఏలూరు క్రైం : ప్రజలు తమ సమస్యలను పోలీస్‌శాఖకు స్వేచ్ఛగా తెలపడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్పీ కేపీఎస్ కిశోర్ అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదులపై వేగంగా విచారణ జరిపి చట్టపరంగా న్యాయం అందించేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 36 మంది నుంచి ఫిర్యాదులను ఎస్పీతో పాటు ఏఎస్పీ సూర్యచంద్రరావు స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదుదారులకు శ్రీ సత్యసాయి సేవా సంస్థ ఉచిత భోజన వసతిని ఏర్పాటు చేసింది.

బెల్టుషాపుల జోరు



- గ్రామాల్లో యథేచ్ఛగా అమ్మకాలు
- సిండికేట్లకు లాభాలు
- తూతూమంత్రంగా ఎక్సైజ్ దాడులు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి) :

నూతన ఎక్సైజ్ పాలసీలో మద్యాన్ని తక్కువ ధరలకు ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చినా గ్రామాల్లో బెల్ట్‌షాపులను అడ్డుకోలేకపోతున్నారు. మద్యం సిండికేట్లు అదనపు లాభాల కోసం వీటిని యథేచ్ఛగా నడుపుతున్నారు. తెల్లవారు జామున, రాత్రి 10 గంటల దాటాక బెల్టుషాపుల్లో మద్యం ఏరులై పారుతోంది. అమ్మేవారి కొంత లాభం, సిండికేట్లకు 25 శాతం ముట్టుతోందన్న ఆరోపణలున్నాయి. కొందరు కూటమి నేతల అనుచరులు, కార్యకర్తలు చేతుల్లో ఇవి ఉండడం వల్ల వీటిపై ఎక్సైజ్‌శాఖ అధికారులు దాడులు చేసేందుకు జంకుతున్నారన్న విమర్శలున్నాయి.

- భీమడోలు, ద్వారకాతిరుమల, నిడమర్రు, ఉంగుటూరు మండలాల్లో మద్యం సిండికేట్లు బెల్టుషాపుల నిర్వాహకులుగా మారారు. కిళ్లీ దుకాణాలే కేరాఫ్ బెల్టు దుకాణాలుగా మారాయి. ఉంగుటూరు మండలంలో ప్రతీ ఊళ్లోను బెల్టుషాపులు ఉన్నాయి. మద్యం లైసెన్సు పొందిన యజమానులు క్వార్టర్‌కు అదనంగా రూ. 10 వసూలు చేస్తే, బెల్టుషాపులో క్వార్టర్ రూ.90 ఉంటే రూ.110 వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. పెన్షన్‌దారులకు కొన్ని షాపుల యాజమానులు అరువుకు మద్యం సరఫరా చేస్తున్నారు. భీమడోలులో డైరెక్టుగానే బెల్టుషాపుల ద్వారా మద్యం నిరంతరం అమ్మకాలు చేస్తున్నారు.
- ఏలూరులో బావిశెట్టివారిపేట, కోడేలు, సత్యనారాయణపేట, గజ్జెలవారి చెరువు, వంగాయగూడెం, గన్‌బజార్, కొత్తపేట నూకాలమ్మగుడి, పత్తేబాద, గూడ్స్‌షెడ్డురోడ్డు, పాండురంగాపురం, అల్లూరి సీతారామరాజు స్టేడియం పుల్లల అడితి సమీపంలో, వట్లూరు రైల్వేగేటు శివారుల్లో బెల్టుషాపుల జోరు అంతా ఇంతా కాదు.
- పోలవరంలో ఓ మాజీ ఉప సర్పంచి నిర్వహణలో అనుచరులు సిండికేట్ వ్యాపారం చేస్తుండడంతో మండలంలో వీళ్లైనన్నీ బెల్టుషాపుల్లో రూ.20 నుంచి రూ.50 వరకు బాటిల్‌కు అదనంగా వసూళ్లు చేస్తున్నారు. బెస్తావీధి, కమ్మరగూడెం, యడ్లగూడెం, గూటాల, పట్టిసీమ, కొత్తపట్టిసీమ, పోలవరం ప్రగడపల్లి, ఎల్ఎన్‌డీ పేట పంచాయతీల పరిధుల్లో బెల్టుషాపుల నిర్వహణ జరుగుతోంది.
- దెందులూరు మండలంలో పాలగూడెంలో 2, మెట్ట పంగిడిగూడెంలో ఎక్కువగా ఉన్నాయి. ఓ ప్రజాప్రతినిధి పేరుచెప్పి బెల్టుషాపులను గ్రామగ్రామాన నడుపుతున్నారు. పెదవేగి, పెదపాడు, ఏలూరు రూరల్ మండలాల్లోను బెల్టుషాపులను దర్జాగా నిర్వహిస్తున్నారు. రాటాలమ్మ ఆలయం వద్ద కూడా గురు, ఆదివారాల్లో బెల్టు దుకాణాల ద్వారా మద్యం ఏరులైపారుతోంది.
- చింతలపూడి నియోజకవర్గంలోనే బెల్టు షాపులు పెద్ద సంఖ్యలోనే నడుస్తున్నాయి. బహిరంగంగా జంగారెడ్డిగూడెంలో టీడీపీ, జనసేన నేతలు సిండికేట్లుగా మారారు. టౌన్‌లోనే ఐదుషాపుల నుంచే లూజుగా బాటిళ్లను పంపి క్యాష్ చేసుకుంటున్నారు. ఊరికి శివారుల్లో ఉండే డాబాల్లోనే బీర్లు, మద్యం దొరుకుతుండడం విశేషం. లింగపాలెం మండలంలో నాలుగుషాపులు ఉండగా, ప్రగడవరం శివారులో బెల్టుషాపు నిరంతరం సాగుతున్నాయి. బుట్టాయగూడెం, జీలుగుమల్లి, కొయ్యలగూడెంల్లో బెల్టుషాపులు ఎక్కువగా విస్తరించాయి.
- నూజివీడు నియోజకవర్గంలో 84 గ్రామాల్లోను టీడీపీ, వైసీపీ నేతల కనుసన్నల్లో చెరో ఒకటి చొప్పున బెల్టుషాపులు నడుస్తున్నాయి. ఎంఆర్‌పీ రేటుకంటే అదనంగా వసూళ్లకు పాల్పడుతున్నారు. ప్రధాన షాపుల నుంచి బహిరంగంగానే వ్యాన్లు, కార్లలో బెల్టు దుకాణాలకు సరుకు రవాణా అవుతోంది.
- కైకలూరు నియోజకవర్గంలోని మండలాల్లో బెల్టుషాపుల జోరుగానే సాగుతున్నాయి. కిళ్లీకొట్లే కాక పర్మిట్ రూమ్‌లుగా షాపుల వెనుకే అమ్మకాలు సాగుతున్నాయి. ముదినేపల్లి, మండవల్లి, కలిదిండిల్లోను బెల్టుషాపులు మూడు పూవులు, ఆరుకాయల అన్నచందనా సాగుతున్నాయి.

2027 నాటికి పోలవరం పూర్తి

» మాజీ మంత్రి పీతల సుజాత

అమరావతి, మే 5 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టును 2027 గోదావరి పుష్కరాల నాటికి పూర్తి చేయాలనే ధృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని, నిర్మాణ పనులను పరుగులు పెట్టిస్తున్నారని మాజీ మంత్రి పీతల సుజాత అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో సుజాత మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి పోలవరం ప్రాజెక్టు ఒక కలగానే మిగిలిపోతూ వస్తోందని, చంద్రబాబు సంకల్ప బలంతో పోలవరం ప్రాజెక్టు పూర్తి కావడం ఖాయమన్నారు. వైసీపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టుపై చాలా నిర్లక్ష్యం వహించిందని, వైసీపీ హయాంలో పోలవరం నిర్మాణానికి కేటాయించిన నిధుల్ని దారి మళ్లించారని, రివర్స్ టెండరింగ్ ద్వారా రూ.25 వేల కోట్ల వ్యయభారాన్ని మోపారని విమర్శించారు. గత ఐదేళ్లలో వైసీపీ పాలకులు పోలవరం పనులు సక్రమంగా చేసి ఉంటే ఈపాటికే ప్రాజెక్టు పూర్తయ్యేదని సుజాత అన్నారు.


పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

ఎన్‌టీఎన్‌ఎల్ పరీక్షలకు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు

నూజివీడు టౌన్, మే 5(ఆంధ్రజ్యోతి): ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల్లో శాస్త్రసాంకేతిక రంగంలో మరింత మెలకువలు పెంచేదిశగా నేషనల్ ప్రోగ్రామ్ ఆన్ టెక్నాలజీ ఎన్‌హాన్స్‌డ్ లెర్నింగ్‌పై పరీక్ష నిర్వహించారు. ట్రిపుల్ ఐటీ విద్యార్థులు 10,300మంది పరీక్షలకు హాజరైనట్లు ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఎస్.అమరేంద్రకుమార్ తెలిపారు. ఐఐటీలు, ఐఐఎస్‌సీ లాంటి దేశవాళి, ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల భాగస్వామ్యంతో భారత మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేషనల్ ప్రోగ్రామ్ ఆన్ టెక్నాలజీ ఎన్‌హాన్స్‌డ్ లెర్నింగ్ పరీక్షలకు ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, శ్రీకాకుళం, ఆర్కేవాలీ, ఒంగోలు క్యాంపస్‌ల నుంచి తృతీయ, ఆఖరి సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించడానికి రూపొందించిన ఈ కోర్సులు ప్రత్యేకమని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి మరిన్ని కోర్సులను అందుబాటులో ఉంచనున్నట్లు ఆయన తెలిపారు.


తాడేపల్లిగూడెంలో గ్రామోత్సవంలో వేద విద్యార్థులు

తాడేపల్లిగూడెంలో వేద పరీక్షలు

తాడేపల్లిగూడెం రూరల్, మే5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయగోదావరి జిల్లా వేద పరీక్షలు తాడేపల్లిగూడెం పట్టణంలోని శంకర మఠం వద్ద సోమవారం నిర్వహించారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల నుంచి భారీగా వేద విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలో గ్రామోత్సవం నిర్వహించారు. మంగళవారం కూడా పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షలను వేద శాస్త్ర, శ్రౌత, స్మార్త, ఆగమ, అపర విద్యలలో గురువులు పరీక్షించారు. వేద విద్యార్థులు వారి ప్రతిభను ప్రదర్శించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సందర్శించి వేద మంత్రోచ్చరణలతో మార్మోగుతున్న ప్రాంగణం ఇలానే భాసిల్లాలని ఆకాంక్షించారు. వేద పరీక్షలు నిర్వహిస్తున్న వారికి ఆయన సొంత నిధులతో రూ.35వేలు ప్రోత్సాహకం అందించారు.


ఎంపీకి సమస్యలు వివరించిన పేరంటాలపల్లి నిర్వాసితులు

గోదావరిపై 30 కిలో మీటర్ల ప్రయాణం

ఎంపీకి సమస్యలు వివరించిన మహిళా నిర్వాసితులు

పోలవరం, మే 5: నడి నెత్తిన మండుతున్న ఎండలో ఆరుగురు గిరిజన మహిళలు గోదావరిపై 30 కిలో మీటర్ల పడవలో ప్రయాణం చేశారు. సోమవారం పోలవరం ప్రాజెక్టు పర్యటనలో ఉన్న ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్‌ను కలిసి తమ సమస్యలు మొరపెట్టుకున్నారు. వేలేరుపాడు మండలం పేరంటాలపల్లి గ్రామానికి చెందిన తమకు ఆర్ అండ్ ఆర్ పరిహారాలు ఇంకా అందలేదని, తమకు ఇష్టంలేని, అందుబాటులో లేని దొరమామిడి గ్రామంలో పునరావాస కాలనీలు కేటాయించారని తెలిపారు. తమకు జీలుగుమిల్లి మండలంలో పునరావాసాలు కేటాయించాలని ఎంపీ మహేశ్‌కు వినతిపత్రం అందించినట్లు పేరంటాలపల్లి గ్రామ మహిళలు తెలిపారు. పేరంటాలపల్లి గ్రామం నుంచి మర పడవపై పోశమ్మగండికి చేరుకున్నామని, అక్కడి నుంచి ఆటోలో పోలవరం ప్రాజెక్టు వద్దకు వెళ్లినట్లు గిరిజన నిర్వాసిత మహిళలు తెలిపారు. ఆకలితో ఉన్న పేరంటాలపల్లి నిర్వాసిత గిరిజన మహిళలకు మెగా ఇంజనీరింగ్ అధికారులు భోజనం పెట్టించి పంపించారు.

చిన వెంకన్నను దర్శించుకున్న

బుల్లితెర నటి సుహాసిని


బుల్లితెర నటి సుహాసిని

ద్వారకాతిరుమల, మే 5(ఆంధ్రజ్యోతి): నటనతో పాటు అదృష్టం కలిసివస్తేనే చలనచిత్ర రంగంలో రాణిస్తారని చలనచిత్ర, బుల్లితెర నటి సుహాసిని అన్నారు. చిన వెంకన్న ఆలయాన్ని సోమవారం ఆమె సం దర్శించారు. స్వామి, అమ్మవార్లను దర్శిం చుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆమెను గుర్తించిన పలువురు భక్తులు ఆమెతో ఫొటో లు దిగారు. 2003లో బిజయ దర్శకత్వంలో రూపొందిన చంటి సిని మాతో చిత్ర రంగప్రవేశం చేసినట్లు చెప్పారు. ఆతరువాత తెలుగు, తమిళ, కన్నడ సినిమాల్లో నటిం చానన్నారు. ఆ తరువాత తెలుగు, తమిళ బుల్లితెర సీరియల్స్‌లో నటించానన్నారు. 2010లో అపరంజి ధారావాహిక ద్వారా బుల్లితెరలో ప్రవేశించి ఎన్నో హిట్ సీరియల్స్ చేసినట్లు చెప్పారు.

భక్తులతో కిటకిటలాడిన నత్తా రామేశ్వరం


స్వామివారికి అభిషేకం

పెనుమంట్ర, మే 5 (ఆంధ్రజ్యోతి): నత్తా రామేశ్వరం సప్త కోటి రామలింగేశ్వర స్వామి దర్శనార్థం భక్తులు పోటెత్తారు. 11 నెలలు నీటిలో ఉండి వైశాఖ మాసంలో దర్శనమిచ్చే శివలింగాన్ని పూజించేందుకు సోమవారం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రామ లింగేశ్వర శర్మ, కాశీభట్ల సూర్యనారాయణ మూర్తి, భాస్కర్ శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి ఏకదశ రుద్రాభిషేకం పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. దాతల సహకారంతో ప్రసాద వితరణ, అన్న సమారాధన నిర్వహించినట్లు ఆలయ ఈవో వేణుగోపాల్ తెలిపారు.

శ్రీనివాస కల్యాణం చూతము రారండి



రేపటి నుంచి చిన వెంకన్న తిరు కల్యాణ మహోత్సవాలు


శేషాచలంపై చిన వెంకన్న వైశాఖ మాస బ్రహ్మోత్సవాలకు ముస్తాబయ్యాడు.. బుధవారం నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆలయంలో వైఖానస ఆగమంలో పాంచాహ్నిక దీక్షతో ఏటా రెండుసార్లు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఈ నెల 7 నుంచి 14 వరకూ కల్యాణోత్సవాలు జరగనున్నాయి.

» తొలిరోజు వధూవరులుగా స్వామి, అమ్మవార్లు
» 11న శ్రీవారి కల్యాణం
» 12న రథోత్సవం

ద్వారకాతిరుమల, మే 5(ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం ఉదయం స్వామి, అమ్మవార్లను వధూవరులను చేస్తారు. 8న ధ్వజారోహణ, 10న ఎదుర్కోలు ఉత్సవం, 11న రాత్రి 8.30 గంటలకు శ్రీవారి తిరుకల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. 12న రాత్రి 7.30 గంటలకు రథోత్సవం, 13న శ్రీచక్ర వార్యుత్సవం, ధ్వజావరోహణ, 14న చూర్ణో త్సవం, వసంతోత్సవం, రాత్రి ద్వాదశ కోవెల ప్రదక్షిణ, శ్రీపుష్పయాగోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి.

వాహన సేవలు..

బ్రహ్మోత్సవ సమయంలో స్వామి, అమ్మవార్లకు నిత్యం జరిగే వాహన సేవల నిమిత్తం వివిధ రకాల వాహనాలను సిద్ధం చేస్తున్నారు. రోజుకో వాహనంలో అమ్మవార్లతో కలసి శ్రీవారు వివిధ అలంకారాల్లో ఊరేగుతారు. 7న రాత్రి గజ వాహనం, 8న హంస వాహనం, 9న ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనం, 10న ఉదయం హనుమంత వాహనం, రాత్రి వెండి శేష వాహనం, 11న రాత్రి శ్రీవారి కల్యాణం అనంతరం వెండి గరుడ వాహనంపై స్వామివారి తిరువీధి ఉత్సవాలు నిర్వహిస్తారు. 12న స్వామివారి రథోత్సవం, 13 రాత్రి అశ్వవాహనంపై గ్రామోత్సవం జరుగుతుందని ఈవో వివరించారు. ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

నిత్యార్జిత కల్యాణాలు, సేవలు రద్దు

ఉత్సవాలు జరిగే రోజుల్లో నిత్యార్జిత కల్యాణాలు, సేవలు రద్దు చేస్తున్నట్లు ఆలయ ఈవో తెలిపారు. 15 నుంచి అన్ని సేవలు యధావిధిగా పునరుద్ధరిస్తామని భక్తులు గమనించాలని కోరారు. కల్యాణ మహోత్సవాలను వైభవంగా జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. మంగళవారం రాత్రికి అన్ని ఏర్పాట్లు దాదాపు పూర్తవుతాయి. అదనపు క్యూలైన్లు, విద్యుద్దీప అలంకారాలు చేస్తున్నట్లు వివరించారు

దేవదాయ మంత్రికి ఆహ్వానం


మంత్రిని ఆహ్వానిస్తున్న ఆలయ ఈవో, అర్చకుడు

ఈనెల 11న చిన వెంకన్న కల్యాణోత్సవానికి దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని ఆలయ అధికారులు, అర్చకులు ఆహ్వానించారు. సోమవారం మంత్రి నివాసానికి వెళ్లి వేదాశీర్వచనం అందజేశారు. అనంతరం శ్రీవారి శేషవస్త్రం, కల్యాణ పత్రిక, ప్రసాదం, స్వామివారి చిత్రపటాన్ని మంత్రికి ఈవో సత్యనారాయణమూర్తి, అర్చకులు భాను అందించారు.

నేటి నుంచి కాళ్లకూరు

వేంకన్న కల్యాణోత్సవాలు



కాళ్ల, మే 5 (ఆంధ్రజ్యోతి) : కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి సప్తాహ్నిక తిరుకల్యాణ మహోత్సవాలు ఈ నెల 6 నుంచి 14 వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో ఎం. అరుణ్‌కుమార్ సోమవారం తెలిపారు. 8వ తేదీ రాత్రి 7.30 గంటలకు డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణంరాజు దంపతులు స్వామివారి కల్యాణం నిర్వహిస్తారన్నారు. 12న సాయంత్రం స్వామివారి దివ్య రథోత్సవం జరపనున్నట్లు తెలిపారు. కల్యాణ మహోత్సవాల సందర్భంగా ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉందని, ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆయన స్పష్టం చేశారు.

ముఖం చాటేశారా..

తప్పించుకోలేరు!



» ఉమ్మడి జిల్లాలో 11 మంది వైద్య సిబ్బందిపై చర్యలకు ఆదేశాలు
» 8 మంది పీహెచ్‌సీ వైద్యాధికారులే!
» ఫోన్ సెట్టింగ్స్‌తో టాంపరింగ్
» వారిపై కఠిన చర్యలు

హెల్త్ ఎఫ్ఆర్ఎస్ యాప్ హాజరు నమోదులో అవకతవకలు

ఏలూరు అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): వైద్య శాఖలో హాజరు నమోదులో అవకతవకలు వెలుగు చూశాయి. వైద్యాధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి ఆరోగ్యశాఖ అమలు చేస్తున్న ముఖ గుర్తింపు ఆధారిత(ఎఫ్ఆర్ఎస్) హెల్త్ యాప్‌లో తప్పుడు సమాచారాన్ని నమోదు చేశారనే అభియోగాలపై ఉమ్మడి పశ్చిమలో 11 మందిపై చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు 8మంది, ఒక ఎంఎల్‌హెచ్‌పీ, ఒక గ్రేడ్-2 ఫార్మసిస్టు, ఒక గ్రేడ్-2 ల్యాబ్ టెక్నీషియన్ ఉన్నారు. ప్రతీరోజు ఉదయం వారికి కేటాయించిన కార్యస్థానాల్లో పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది ఎఫ్ఆర్ఎస్ హాజరును విధిగా నమోదు చేయాల్సి ఉంటుంది. క్షేత్రస్థాయి సందర్శనకు వెళ్లాల్సివస్తే వివరాలను నిర్ణీత బుక్‌లో నమోదు చేస్తే పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ధ్రువీకరిస్తారు. దీనికి భిన్నంగా కొందరు పీహెచ్‌సీ ప్రధాన కార్యస్థానాలకు వెళ్లకుండా, అనుబంధ సబ్ సెంటర్లను మ్యాపింగ్ చేసుకోవడం, ఆ ప్రాంతంలోకి రాగానే హాజరు నమోదు చేసుకుని వెళ్లిపోతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

గతనెల 10న ఎఫ్ఆర్ఎస్ స్టేట్ నోడల్ ఆఫీసర్ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పీహెచ్‌సీల్లో ముఖగుర్తింపు ఆధారిత హాజరు నమోదు పరిశీలించారు. పలు పీహెచ్‌సీల్లో ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదు ఐఫోన్ల ద్వారా డేట్, టైం సెట్టింగ్‌లను ట్యాంపరింగ్ చేసి తప్పుడు సమాచారాన్ని నమోదు చేస్తున్నట్టు గుర్తించారు. తప్పుడు మార్గంలో హాజరు నమోదు చేయడం ద్వారా తమ కార్యస్థానాలకు హాజరుకావడంలో కొందరు బురిడీ కొట్టిస్తున్నట్టు గమనించారు. యాప్‌లో తప్పుడు సమాచారాన్ని నమోదు చేస్తున్నారని సర్వీస్ ప్రొవైడర్ అందజేసిన వివరాలతో నిర్ధారణకు వచ్చారు. ఇలా ఒకటి నుంచి గరిష్ఠంగా మూడు దఫాలు ట్యాంపరింగ్‌కు పాల్పడినట్టు తేల్చారు. దీంతో గత నెలలోనే సంబంధిత ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ, ఆ వెంటనే వివరణ ఇవ్వడం జరిగిపోయాయి. హాజరు నమోదులో మాల్‌ప్రాక్టీస్ విధానాలకు చెక్‌పెట్టాలని నిర్ణయించిన ఉన్నతాధికారులు తాజాగా కఠిన చర్యలకు ఉపక్రమించారు.

ఎల్ఎన్‌డీ పేట, ముదినేపల్లి, పీఆర్.గూడెం, పూళ్ల, రాఘవాపురం, తాడువాయి, పెనుగొండ, మార్టేరు పీహెచ్‌సీల్లో కొందరు వైద్యాధికారులతో పాటు, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక ఫార్మాసిస్టు, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్(హెచ్‌డబ్ల్యూసీ)లో మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ)లపై తదుపరి చర్యలకు ఆదేశించారు. వీరిలో రెగ్యులర్‌ప్రాతిపదికన పనిచేసేవారిపై సీసీఏ రూల్స్‌ప్రకారం క్రమశిక్షణచర్యలు, కాంట్రాక్టు/ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేసేవారిని విధులనుంచి తొలగించి, ఆ సమాచారాన్ని రాష్ట్ర కార్యాలయానికి తెలియజేయాలని ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆదేశించారు.

విధుల నుంచి తొలగించారు..?

హాజరులో ట్యాంపరింగ్‌కు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కాంట్రాక్టు/ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఒక ల్యాబ్ టెక్నీషియన్‌ను విధులనుంచి తొలగిస్తూ జిల్లా అధికారి ఉత్తర్వులు జారీచేసినట్టు సమాచారం. మిగతావారిపై చర్యలకు ఆచితూచి వ్యవహరిస్తున్నట్టుగా ప్రచారం జరుగుతోంది. కఠినచర్యలు తీసుకోకుండా ఉన్నత స్థాయిలో పైరవీలు, లాబీయింగ్ జరుగుతున్నట్టుగా సమాచారం. తొలి తప్పుగా పరిగణించి వదిలేయాలని, ఇకమీదట ఇలా జరుగబోదని పలువురు తమ ప్రయత్నాలను ముమ్మరం చేసినట్టు తెలుస్తోంది.

ఉన్నతాధికారుల ఆదేశాలు అందాయి..

హాజరు ట్యాంపరింగ్‌పై చర్యలకు ఉన్నతాధికుల నుంచి ఆదేశాలు అందాయి. వాటిని ఇంకా చదవలేదు. పూర్తి వివరాలు తెలీదు. జిల్లాకు చెందిన వారెవరైనా ఉన్నారనే దానిపై కార్యాలయ సెక్షన్ సిబ్బంది నుంచి వివరాలను తీసుకుంటా.

\- డాక్టర్ మాలిని, జిల్లా వైద్యాధికారి

అగ్రిగోల్డ్ ఆస్తుల వేలానికి

జిల్లా స్థాయి కమిటీ

ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

ఏలూరు, మే 5(ఆంధ్రజ్యోతి): స్పెషల్ కోర్టు ఏలూరు ఉత్తర్వులు, ప్రభుత్వ జీవో నెంబర్ 519 ప్రకారం అగ్రిగోల్డ్ ఆస్తులను వేలం వేయడానికి జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటుచేస్తూ కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఉత్తర్వులను జారీ చేశారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం ఆర్డీవోలు, జిల్లా రిజిస్ట్రార్, డీపీఆర్వో, జిల్లా ఐటి అధికారి (డీఐవో, ఎన్ఐసీ), సీఐడీ ఏఎస్పీ, నగరపాలకసంస్థ ఏవో, ఏలూరు స్పెషల్‌కోర్టు అగ్రిగోల్డ్ సూచించిన పేర్ల సీతారామస్వామిని ఆథరైజ్డ్ మెంబర్‌గా జిల్లా స్థాయి కమిటిని నియమిస్తూ ఉత్తర్వులను కలెక్టర్ ఇచ్చారు. సీఐడీ అదనపు ఎస్పీ కమిటీ మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఏలూరు అర్బన్, ద్వారకాతిరుమల మండలం తహసీల్దార్, జిల్లా స్థాయి కమిటీకి, పోలీస్, సీఐడీ దర్యాప్తు ఏజెన్సీలకు విచారణ సమయంలో వారికి సహకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అగ్రిగోల్డ్ ఆస్తులు ఎక్కడ ఉన్నాయో పరిశీలించడం, అధీకృత సంస్థల నుంచి సరమైన మార్కెట్ ధర సేకరించడం, అగ్రిగోల్డ్ భూములు రెవెన్యూ రికార్డుల్లో మ్యుటేషన్ చేయడం, జిల్లా స్థాయి కమిటీ విధులుగా తెలిపారు.

అగంతకుడి మాటలు నమ్మి..

వెళ్లిపోయారు

» బాలికల అమాయకత్వం
» పోలీసులనాశ్రయించిన తల్లిదండ్రులు
» మూడు గంటల్లో ఆచూకీ కనిపెట్టారు


ఏలూరు క్రైం, మే 5 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు రాసిన ఇద్దరు బాలికలు ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమై అగంతకుడి మాటలు నమ్మి ఇంటి నుంచి వెళ్లిపోయారు. తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించడంతో తప్పిపోయిన బాలికలను మూడు గంటల వ్యవధిలో ఏలూరు టూటౌన్ పోలీసులు తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. టూటౌన్ సీఐ అశోక్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు నగరంలోని ఇద్దరు బాలికలు పక్కపక్క ఇళ్లలో నివాసముంటున్నారు. వారికి కొద్ది రోజుల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో ఒకడు పరిచయం అయ్యాడు. అతడి మాటల మాయలో పడిన బాలికలు ఇంటి నుంచి వెళ్లిపోయారు. వారి కోసం తల్లిదండ్రులు వెతికినప్పటికి ఆచూకీ లేకపోవడంతో సోమవారం సాయంత్రం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ అశోక్‌కుమార్ కేసు నమోదు చేయగా డీఎస్పీ డి శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి అత్యాధునిక పరిజ్ఞానాన్ని వినియోగించి తప్పిపోయిన ఇద్దరు బాలికలను మూడు గంటల వ్యవధిలో తల్లిదండ్రులకు అప్పగించారు. అనంతరం తల్లిదండ్రులకు బాలికలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ అగంతకులను నమ్మి మోసపోవద్దని ఆయన సూచించారు.

బీచ్‌లో గల్లంతైన యువకుడి

మృతదేహం లభ్యం

మొగల్తూరు, మే5 (ఆంధ్రజ్యోతి): పేరుపాలెం సాగర తీరానికి వచ్చిన యువకుడు సముద్ర స్నానానికి దిగి గల్లంతయ్యాడు. అతడి మృతదేహం సోమవారం లభ్యమైంది. యలమంచిలి మండలం అబ్బిరాజుపాలెంకు చెందిన వలవల దివ్య శ్రీరామ పవన్ కుమార్ (22) ఆదివారం సెలవుదినం కావడంతో అతని స్నేహితులతో కలిసి ఆదివారం పేరుపాలెం బీచ్‌కు వచ్చాడు. ఉదయం సముద్ర స్నానానికి దిగిన పవన్ కుమార్ సముద్ర అలల ఉధృతికి కొట్టుకుపోయాడు. సోమవారం ఉదయం విగతజీవిగా తీరానికి కొట్టుకువచ్చాడు. మృతదేహాన్ని నరసాపురం ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

ఊపిరి తీసే ఉబ్బసం



అకస్మాత్తుగా దగ్గు, జలుబు, ఆయాసం, ఊపిరి పీల్చుకోడానికి ఇబ్బంది ఉంటే కచ్చితంగా ఉబ్బసం (తీవ్రమైన శ్వాసకోశ వ్యాధి) అని గుర్తించవచ్చు. శరీరంలో వ్యాధి నిరోధక శక్తి తగ్గినప్పుడు ఈ వ్యాధి బారినపడతారు. దుమ్ము, ధూళి, పరిసరాల పరిశుభ్రత లేకపోవడం, గాలిలో తేమ శాతం తక్కువగా ఉన్నప్పుడు ఈ వ్యాధి బయటపడుతుంది. ఉమ్మడి పశ్చిమలో 10 వేల మంది ఆస్తమా బాధితులు అంచనా. ఈ వ్యాధిపై అవగాహన కల్పించడానికి ఏటా మే మొదటి మంగళవారం ప్రపంచ ఆస్తమా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది ఒకొక్క నినాదంతో ఆస్తమా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఇన్హేల్డ్ ట్రీట్మెంట్ (పీల్చే మందులు) అందరికి అందుబాటులో ఉండేలా చేయండి అనే నినాదంతో మంగళవారం ప్రపంచ వ్యాప్తంగా ఆస్తమా దినం నిర్వహిస్తున్నారు.

ఏలూరు క్రైం/పోలవరం, మే 5 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఉబ్బసంగా పిలిచే ఆస్తమా ఊపిరి ఆపేసేంత ప్రమాదకారి. తగ్గినట్లు అనిపించినా మరోసారి తిరగబెడుతుంది. అందుకే వైద్యులు దీనిని వచ్చిపోయే జబ్బు అని చెబుతారు.

ఆస్తమా లక్షణాలు

- ఊపిరితిత్తుల్లో నాళాలు ఇన్‌ఫెక్షన్‌తో ఉబ్బిపోవడం వల్ల లోపలి భాగం సన్నబడి గాలిపీల్చుకోవడం కష్టతరంగా అవుతుంది.
- హైపర్ రియాక్షన్‌తో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతుంది.
- వాతావరణంలో దుమ్ము, ధూళి, చల్లని వాతావరణం, అపరిశుభ్రత వాతావరణం, దుర్గంధం, మొక్కలపై పుప్పొడి, జంతువుల వెంట్రుకలు వల్ల శ్వాస నాళాలు కుచించుకుపోయి ఊపిరి పీల్చుకోవడం కష్టతరం అవుతుంది.
- దగ్గు, ఆయాసం, కఫంతో ఊపిరి పీల్చుకోవడం భారంగా మారుతుంది.

చికిత్సా విధానం

వాయుకాలుష్యం, చల్లనిగాలి, దుర్గంధ వాసనలకు దూరంగా ఉండాలి. అలర్జీలేకుండా చూసుకోవడం, సిగరెట్లు, బాణసంచా, కొవ్వొత్తులు, పొగకు దూరంగా ఉండడం. అనారోగ్యంతో ఉన్న వ్యక్తులు (జలుబు లేదా ఫ్లూ) దూరంగా ఉండడం. పరిసరాల్లో దుమ్ము, ధూళి లేకుండా చూసుకోవడం. న్యూమోనియా, డిఫ్తీరియా, ధనుర్వాతం, జోస్టర్ వ్యాక్సిన్, గోరింత దగ్గును నివారించడానికి సకాలంలో టీకాలు వేయించడం, ఆస్తమా మందులను క్రమం తప్పకుండా వినియోగించడం.

జాగ్రత్తలతోనే వ్యాధికి దూరం



దగ్గు, ఆయాసం రోజులు తరబడి ఉంటే పల్మనరీ ఫంక్షన్ టెస్ట్ (పీఎఫ్‌టీ) ద్వారా ఈ వ్యాధిని నిర్ధారించవచ్చు. అన్ని కాలాల్లో దగ్గు, ఆయాసం, పిల్లికూతలు వంటి లక్షణాలు కనిపిస్తాయి. చాతీ ఎక్స్‌రే ద్వారా ప్రాథమికంగా గుర్తించవచ్చు. మద్యపానం, ధూమపానం చేసేవారిలో బ్రాంకైటిస్ వస్తుంది. ఇళ్లలో బూజులు, ఇళ్ల వద్ద ఉన్న చెట్ల పూసే పూల పుప్పొడి వల్ల, కూల్‌డ్రింక్‌లు తాగడం, ఏసీలో ఎక్కువగా ఉండడం వల్ల ఈ వ్యాధికి గురవుతుంటారు. డెర్మిఫిలిన్, యాంటీబయోటిక్స్, స్టెరాయిడ్స్, నోటి ద్వారా పీల్చే మందులు తీసుకుంటారు. పీల్చే మందుల వల్ల ఎలాంటి దుష్పరిణామాలు ఉండవు. వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించే పౌష్టికాహారం తీసుకోవాలి. తగిన జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధిని అదుపు చేయవచ్చు. రోజుల తరబడి వైద్యం పొందకుంటే ప్రాణాలకు ప్రమాదం ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. అన్ని వేళలా తగిన జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో ముఖ్యం.

\- డాక్టర్ తోకల సికింద్రమోహన్, ప్రభుత్వ వైద్య కళాశాల, ఏలూరు


చికిత్స పొందుతున్న బాధితులు

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

కుక్కునూరు, మే 5(ఆంధ్రజ్యోతి): దాచారం పంచాయతీ నెమలిపేటలో సోమవారం ఉపాధి పనులు చేస్తున్న కూలీలపై తేనెటీగలు దాడి చేశాయి. తప్పించుకునే క్రమంలో 10మంది గాయపడ్డారు. వారిని కుక్కునూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో కంటిపల్లి శిరీష, కుమారి, పట్లా దుర్గమ్మ, కారం రామారావు, కారం భద్రమ్మ, కౌలూరి శిరీష ఉన్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఎం.యు గంధర్, వై.నాగేంద్ర రావు వైద్యులను కోరారు.

రేపు వాసవీ మాత జయంతి వేడుకలు

చింతలపూడి, మే 5(ఆంధ్రజ్యోతి):పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్టు సంఘ నిర్వాహకులు వజ్రపు కిషోర్, కొనకళ్ళ ప్రసాద్ తెలిపారు. ఉదయం కోదండ రామాలయంలో 7 గంటలకు పంచామృతాభిషేకం, పుష్పార్చన, సాయంత్రం 4 గంటలకు ఆంజనేయస్వామి గుడి వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, 108కలశాలతో మహిళల ఊరేగింపు జరుగుతుందని తెలిపారు. వికెఎం, శ్రీశ్రీ ఫంక్షన్ హాళ్ళల్లో సామూహిక సహస్ర, కుంకుమార్చన జరుగుతుందన్నారు.

ఏడవ రోజుకు చేరిన వేసవి విజ్ఞాన తరగతులు

ఏలూరు టూటౌన్, మే5 (ఆంధ్రజ్యోతి): చెడు స్నేహాల వలన ఎన్నో దుష్పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శేఖర్‌బాబు అన్నారు. వేసవి విజ్ఞాన తరగతులు 7వ రోజుకు చేరుకున్నాయి. బీవీఎస్ లక్ష్మి విద్యార్థులకు ఓంకారం నినాదంతో యోగాక్లాసులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నృత్యకళాకారులు ఫణికాంత్, డిప్యూటీ లైబ్రేరియన్ నారాయణరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ బీటీ.సందీప్‌కుమార్, ఎండీ అస్లాం బాష, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్ల భాష సామర్థ్యాలపై టీచర్లకు శిక్షణ

ఏలూరు అర్బన్, మే 5(ఆంధ్రజ్యోతి): జోన్-2 పరిధిలోని పూర్వపు ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల గురుకుల విద్యాలయాలు, మోడల్ స్కూళ్లలో పీజీటీలు, టీజీటీలుగా పనిచేస్తున్న ఆంగ్లభాష ఉపాధ్యాయులకు మూడ్రోజుల శిక్షణ సోమవారం ఏలూరులో ప్రారంభమైంది. నాయకత్వ లక్షణాలు, ఆంగ్లభాష సామర్థ్యాలు, బోధనలో సాంకేతికతను భాగం చేయడం వంటి అంశాల్లో ఈ నెల 7వ తేదీ వరకు శిక్షణ కొనసాగుతుందని ఏపీ సోషల్ వెల్ఫేర్ గురుకుల విద్యాలయాల సంస్థ ప్రిన్సిపాల్ డి.ఎం.ఝాన్సీరాణి తెలిపారు. శిక్షణ ఏజెన్సీ కొటక్ ఎడ్యుకేషనల్ ట్రస్టు(ముంబయి) ప్రతినిధులు ఫరీజ్, నూతన్, అమిత, జిల్లా కో-ఆర్డినేటర్ ఉమాకుమారి పాల్గొన్నారు.

సెస్సు బకాయిలు చెల్లించాలని డిమాండ్

ఏలూరు అర్బన్, మే 5(ఆంధ్రజ్యోతి) : ప్రజల నుంచి స్థానిక సంస్థలు వసూలు చేస్తున్న గ్రంథాలయ సెస్సు బకాయిలను లైబ్రరీలకు జమ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమవేదిక జిల్లా కన్వీనర్ నాగాస్త్ర డిమాండ్ చేశారు. సోమవారం బాలల గ్రంథాలయాన్ని ఆయనతో పాటు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ ముస్తఫా అలీ, ద్రోణాదుల శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా అలీ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో లైబ్రరీలు ఏర్పాటు చేయాలన్నారు. బాలల గ్రంథాలయం నిర్వాహకురాలు ఎం.కీర్తి మాట్లాడుతూ వేసవిశిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం, శాస్త్రీయనృత్యం, యోగా, స్పోకెన్ ఇంగ్లీష్‌పై తర్ఫీదు నిస్తున్నట్టు వివరించారు.

చేతుల పరిశుభ్రతతో అంటు రోగాలు దూరం

ఏలూరు అర్బన్, మే 5(ఆంధ్రజ్యోతి) : ప్రపంచ హ్యాండ్‌వాష్ డే కార్యక్రమాన్ని సోమవారం శనివారపుపేట అర్బన్ పీహెచ్‌సీలో నిర్వహించారు. వైద్యాధికారి ఎం.డి.అక్తర్ మాట్లాడుతూ అపరిశుభ్రమైన చేతుల వల్ల వ్యాధులు సంక్రమించే ప్రమాదముందని హెచ్చరించారు. భోజనానికి ముందు చేతులు శుభ్రపర్చుకోవాలని సూచించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు ఆధ్వర్యంలో చేతుల పరిశుభ్రతపై 7పద్ధతులను డెమోద్వారా ప్రదర్శించారు.

విచారణాధికారుల నియామకంపై అభ్యంతరం

ఏలూరు అర్బన్, మే 5(ఆంధ్రజ్యోతి) : రెండు పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకాలకు సంబంధించి ఇటీవల తలెత్తిన వివాదంపై ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో), టీఎస్‌యూఎస్ సంఘాల నాయకులిచ్చిన ఫిర్యాదుపై విచారణాధికారుల నియామకంలో సహేతుకతలేదంటూ సోమవారం 'ఫ్యాప్టో' సభ్యసంఘాల నాయకులు డీఈవో వెంకటలక్ష్మమ్మను కలుసుకుని మరోదఫా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఫ్యాప్టో నాయకులు ఇప్పటికే అందజేసిన ఫిర్యాదుపై సోమవారం సంబంధిత పాఠశాలల్లో విద్యాధికారులు నిర్వహించిన విచారణను బహిష్కరించారు. అనంతరం డీఈవోను కలుసుకుని వివాదం, విచారణాధికారుల అర్హతలపై చర్చించారు. నగరంలోని తూర్పు వీధి ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాల, మౌలానా అబుల్‌కలాం అజాద్ (మాకా) హైస్కూలుకు కేటాయించిన స్కూల్ అసిస్టెంట్ కేడర్ ఉపాధ్యాయపోస్టులను విద్యార్థుల వాస్తవ సంఖ్యను పరిశీలించి సరిచేయాలని ఈ నెల 1న ఫిర్యాదు చేశామన్నారు. ఈ వివాదంలో అభియోగాలున్న మండల విద్యాధికారిపై విచారణను ఉన్నతస్థాయి విద్యాశాఖాధికారితోకాకుండా అదే కేడర్‌లో ఉన్న మరో ఎంఈవో, ఒక హైస్కూలు హెచ్‌ఎంతో చేయించడం వల్ల నిజనిర్ధారణ ఎలా వెలుగులోకి వస్తుందన్నారు. వాస్తవ సమాచారాన్ని రాబట్టేందుకు ఉన్నత విద్యాధికారిని విచారణకు నియమించాలని 'ఫ్యాప్టో' సభ్యసంఘాల నాయకులు మోహన్‌రావు, శ్రీనివాసరావు, రామ్మోహన్, ఎస్.రాంబాబు డిమాండ్ చేశారు.

టీడీపీ మండలాధ్యక్ష పదవి బీసీలకు కేటాయించాలి

ద్వారకాతిరుమల, మే 5(ఆంధ్రజ్యోతి):టీడీపీ మండలాధ్యక్ష పదవి బీసీలకు కేటాయించాలని బీసీ నేతలు డిమాండ్ చేశారు.ద్వారకాతిరుమల కుంకుళ్లమ్మ హోటల్ వద్ద సోమవారం బీసీ సంఘ సమావేశం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ 1983 నుంచి మండలాధ్యక్ష పదవి ఒకే సామాజిక వర్గానికి చెందిన వారికి కేటాయిస్తున్నారన్నారు. అధినేత ఇచ్చిన మాట ప్రకారం పార్టీ పదవుల్లోనూ బీసీలకు సమన్యాయం చేయాలని సీఎం చంద్రబాబు, లోకేశ్‌లకు త్వరలో వినతిపత్రం అందజేస్తామని రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కూరాకుల బుజ్జి, నేతలు సంగెట్ల వెంకటేశ్వరరావు, బొండాడ నరసింహరావు, ములకాల రాంబాబు, వీరిశెట్టి రామారావు పేర్కొన్నారు.

ఎలిమెంటరీ పాఠశాలలను కొనసాగించాలని ధర్నా

ఏలూరు రూరల్/ జంగారెడ్డిగూడెం, మే 5(ఆంధ్రజ్యోతి) : ఎలిమెంటరీ పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఏపీటీఎఫ్ రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపులో భాగంగా సోమవారం ఏలూరు, జంగారెడ్డిగూడెం తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఏపీటీఎఫ్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం తహసీల్దార్లు శేషగిరి, స్లీవ జోజికి వినతిపత్రాలు అందజేశారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు డీకేఎస్ఎన్ ప్రకాష్‌రావు, ఎం కొండయ్య, కృష్ణారావు, బాలాంజనేయులు, నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.ఆనంద్, జంగారెడ్డిగూడెంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్య దర్శి బి.రెడ్డి దొర, నాయకులు కె.సుబ్బారావు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలన్నీ నెరవేరుస్తాం : ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూటౌన్, మే5(ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలన్నీ నెరవేర్చేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులందరికీ సొంతింటి కల నెరవేరుస్తామన్నారు. సంక్షేమ పథకాలను మరింత మందికి చేరుస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మారం హనుమంతరావు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా : ఎమ్మెల్యే రోషన్


కార్యకర్తతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోషన్

లింగపాలెం, మే 5(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కు మార్ అన్నారు. మండలంలో ములగలంపాడు గ్రామానికి చెం దిన టీడీపీ సీనియర్ కార్యకర్త బంటు రామారావు అనారో గ్యంతో బాధపడుతున్నట్టు తెలుసుకున్న ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ సోమవారం ఇంటికి వెళ్లి ఆయనను పరామ ర్శించారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

కదం తొక్కిన దళిత సేన నాయకులు

ఏలూరు రూరల్, మే 5(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ, బీసీ బడుగు బలహీన వర్గాల వారికి సాగు పట్టాలు మంజూరు చేయాలంటూ దళితన సేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాశ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సింహగర్జన పేరుతో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అర్హులైన చర్మకారులకు పెన్షన్లు, మంజూరు చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా రవిప్రకాశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలకు సాగు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో డప్పు కళాకారులు, చర్మకారులకు అర్హులందరికీ పెన్షన్ మంజూరు చేయాలన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పరిరక్షించాలని అందుకు ఎస్సీ సెల్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసి దర్యాప్తు అధికారిగా డీఎస్పీ స్థాయి అధికారిని నియమించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో దళిత సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకర్లమూడి వెంకటరావు, స్టాలిన్, చీలి మోహనరావు, మాణిక్యాల రావు, దిరుసుపాముల పుష్ప, ఈదియా, బేతాళ జయసుధ పాల్గొన్నారు.


కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న నిర్వహిస్తున్న దళిత సేన నాయకులు

ఎట్టకేలకు పనులు ప్రారంభం

- ఏలూరు- నూజివీడు రోడ్డుకు మోక్షం
- సీఎం దృష్టికి సమస్యను తీసుకెళ్లిన ఎమ్మెల్యే
- రూ.4 కోట్లు మంజూరుతో పనులు వేగవంతం

ఏలూరు టూటౌన్, మే 5(ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు ఏలూరు- నూజివీడు రోడ్డుకు మోక్షం లభించింది. దశాబ్దాల తరబడి ప్రజలు ఎదురు చూస్తున్న రోడ్డుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుభం కార్డు పలికారు. క్రితంసారి సీఎం చంద్రబాబు నాయుడు ఏలూరు పర్యటన సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి రోడ్డు ప్రాధాన్యతను వివరించారు. నగర ప్రజలు నూజివీడు వెళ్లాలంటే కొత్తబస్టాండు మీదుగా ఫైర్‌స్టేషన్ చుట్టూ తిరిగి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్ నుంచి శాంతినగర్ సెంట్ థెరిస్సా కళాశాల మీదుగా శనివారపుపేట వరకు రోడ్డుకు కలుస్తుంది. 2కిలోమీటర్ల మేర రోడ్డును వెయ్యడానికి పనులు ప్రారంభించారు. ముఖ్యమంత్రి హామీ మేరకు రోడ్డు నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరయ్యాయి. 7 మీటర్ల వెడల్పు, రెండు కిలోమీటర్ల పొడవున సిమెంటు రోడ్డుగా నిర్మాణం చేపట్టారు. ఈ రోడ్డు నిర్మాణం వల్ల 3కిలోమీటర్ల మేరా ప్రయాణికులకు కలిసి వస్తుంది. అంతేకాకుండా ట్రాఫిక్ ఇబ్బందులు తప్పుతాయి. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రోడ్డు అధ్వానంగా తయారైందని ఎమ్మెల్యే సీఎంకు వివరించారు. రోడ్డు నిండా పెద్దపెద్ద గుంతలు, ప్రయాణికులు రోడ్డుపై వెళ్లాలంటేనే భయపడేవారు. ఈ రోడ్డులో ప్రయాణం చేయాలంటేనే వాహనదారులకు దడపుట్టేది. గత ప్రభుత్వం కనీసం గుంతలు పూడ్చే కార్యక్రమం కూడా చేపట్టలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే ఎమ్మెల్యే చంటి, మేయర్ షేక్ నూర్జహాన్ శాంతినగర్ రోడ్డుపై ప్రత్యేక దృష్టి కనపరిచి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు వెంటనే రూ.4 కోట్లు మంజూరు చేశారు. ఇప్పటికే రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. త్వరలో రోడ్డు నిర్మాణం పూర్తికానుంది.


నిర్మించాల్సి ఉన్న ఏలూరు – నూజివీడు రోడ్డు

పునరావాస కాలనీల్లో లోపాలను ఉపేక్షించేది లేదు


పునరావాస గ్రామంలో పర్యటిస్తున్న ఎంపీ

పోలవరం/ టీనర్సాపురం/ వేలేరుపాడు/ కొయ్యలగూడెం, మే 5(ఆంధ్రజ్యోతి) :పునరావాస కాలనీల నిర్మాణంలో నాణ్యతా లోపాలుంటే ఉపేక్షించేది లేదని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ అధికారులను హెచ్చరించారు. సోమవారం పోలవరం ప్రాజెక్టు పర్యటనకు వచ్చిన ఎంపీకి ఘన స్వాగతం లభించింది. పోలవరం ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఘన స్వాగతం పలికారు. అనంతరం పోలవరం ప్రాజెక్టులో బట్రస్ డ్యాం పరిశీలించి ప్రాజెక్టు కార్యాలయంలో జలవనరుల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు సందర్శన అనంతరం కొండ్రుకోట పునరావాస కాలనీని సందర్శించారు. ఐటీడీఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ గంగు అనీల్ కుమార్, కొండ్రుకోట సర్పంచ్ పైదా నాగరాజులు ఎంపీకీ ఘన స్వాగతం పలికారు. ఈ సమావేశంలో ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, కూటమి నేతలు పాల్గొన్నారు. టీ.నర్సాపురం మండలం మల్లు కుంట గ్రామంలో నిర్వహించిన గంగానమ్మ జాతరలో సోమవారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలేరుపాడు మండలంలోని పేరంటాలపల్లి, కాకిసనూరు, టేకుపల్లి గ్రామాలకు చెందిన గిరిజనులు పోలవరం ఆర్అండ్ఆర్ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. కొయ్యలగూడెం మండలం బయ్యన్నగూడెంలోని స్వగృహం వద్ద మాజీ ఏఎంసీ చైర్మన్ పారేపల్లి రామారావును పరామర్శించారు.

ఉపాధి పనులు కల్పించాలి

ఏలూరు క్రైం, మే 5(ఆంధ్రజ్యోతి) :ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థికంగా వెనుకబడిన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ అన్నారు. ఏలూరు రూరల్ మండలం పాలగూడెం గ్రామంలో అసంఘటిత కార్మికులకు,ఏలూరు నిమ్మకాయల మార్కెట్ యార్డు కార్మికులకు, సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న రత్న ప్రసాద్ మాట్లాడుతూ పని కావాలని అడిగిన వారికి పని కల్పించాలన్నారు. ప్రతి కార్మి కుడు ఇ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవడం ద్వారా ఉచిత పథకాలు అనగా ఇన్సూరెన్సు, వైద్యం, ప్రధాన మంత్రి ఆవాస యోజన వంటి పథకాలు పొందడం సులభమన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ విక్టర్, ఎంపీడీవో సి.హెచ్.పద్మజ, సర్పంచ్ సునీత, క్రాఫ్ట్ కో-ఆర్డినేటర్ వినోద్, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

భూ సర్వేకు సహకరించండి

పెదవేగి, మే 5(ఆంధ్రజ్యోతి) : భూ యజమానులు సర్వే సిబ్బందికి సహకరించి, తమ భూములను ఆన్‌లైన్ చేయించుకోవాలని సర్వే, ల్యాండ్ రికార్డ్స్ ఏడీ ఎం.డి. అన్సారీ అన్నారు. దుగ్గిరాలలో జరుగుతున్న భూమి రీసర్వే పనులను అన్సారీ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుగ్గిరాలలో సర్వే నంబర్ల ఆధారంగా భూమిని 8 బ్లాకులుగా విభజించి, సర్వే చేస్తున్నామన్నారు. ఒక్కో బ్లాక్‌కు ఒక రీసర్వే డిప్యూటీ తహసీల్దారుతో పాటు ఇద్దరు గ్రామ సర్వేయర్లు, వీఆర్‌లుతో బృందాలుగా సర్వే పనులు నిర్వహిస్తున్నారు. రీసర్వేకు సంబంధించి యజమానులు తమ భూ రికార్డులను సంబంధిత సిబ్బందికి చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ సత్యనారాయణ మూర్తి, వీఆర్వోలు ఝాన్సీ, శకుంతల, గ్రామ సర్వేయర్లు మహిధర్, రాజేష్, చిన్నబాబు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

దాసు సంక్షేమ సంఘ అధ్యక్షుడిగా ప్రసాద్



జీలుగుమిల్లి, మే5(ఆంధ్రజ్యోతి): దాసు సంక్షేమ సంఘ మండలాధ్యక్షుడిగా పాముల ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో నూతన అధ్యక్షుడి ఎన్నుకునేందుకు జీలుగుమిల్లిలో సమావేశం నిర్వహించారు. కమిటీలో ఉపాధ్యక్షులుగా పి.నరసింహరావు, కార్యదర్శిగా జెట్టి రామకృష్ణ, సభ్యులు కె.రమేష్, బి.లక్ష్మీ, సమావేశానికి జంగారెడ్డిగూడెం, ద్వారకాతిరుమల, అచ్చన్నపాలెం చెందిన ఎస్.సత్యనారాయణ, కె.నరేష్ హాజరయ్యారు.

డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయండి

- మంత్రి నారా లోకేశ్‌కు వినతి



కొయ్యలగూడెం, మే5(ఆంధ్రజ్యోతి): కొయ్యలగూడేనికి మంజూరైన ప్రభుత్వ డిగ్రీ కాలేజీ త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను సమాఖ్య యూత్ అధ్యక్షుడు గంగిరెడ్ల సతీశ్ కోరారు. సోమవారం ఉండవల్లిలో మంత్రిని కలిసి గిరిజన, గిరిజనేతర విద్యార్థుల సమస్యలను వివరించారు. ఈ విద్యాసంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించేలా చూడాలని మంత్రిని కోరినట్టు సతీశ్ తెలిపారు. ఈ మేరకు మంత్రి లోకేశ్ తక్షణమే పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు.

కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

ఏలూరు రూరల్, మే 5(ఆంధ్రజ్యోతి) : కార్మికులకు కనీస వేతన సలహా బోర్డును వెంటనే నియమించాలని, కనీస వేతనం నెలకు రూ.35 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు చలసాని రామారావు డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం ఏఐటీయూసీ దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఏలూరు కలెక్టరేట్ వద్ద జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీనివాస్ డాంగే అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. 15 ఏళ్లుగా దేశంలో రాష్ట్రంలో కనీస వేతనాల సలహా బోర్డును ఏర్పాటు చేయలేదన్నారు. కార్మికులకు ప్రతినెలా 1వ తేదీన జీతాలు చెల్లించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి ఎ.అప్పల రాజు, జిల్లా నాయకులు డి.లక్ష్మణమూర్తి, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు, కార్యదర్శి కె.విగ్నేశ్, భజంత్రీ శ్రీనివాస్, వి.దత్తాత్రేయ పాల్గొన్నారు.

భోగలింగేశ్వర స్వామికి పూజలు

పోలవరం, మే 5(ఆంధ్రజ్యోతి) : ప్రగడపల్లి పంచాయతీ గుంజవరం గ్రామ వ్యవసాయ క్షేత్రంలో కొలువైన ఉమాసహిత భోగలింగేశ్వర స్వామికి సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏకాదశ రుద్రాభిషేకం, ఫలరస, బిల్వపత్ర, పుష్ప, భస్మాభిషేకాలు, ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. నూతనగూడెం శివాలయం, బంగారమ్మపేట, పట్టిసీమ, గూటాల శివయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కొయ్యలగూడెంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తాం


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

కొయ్యలగూడెం, మే 5 (ఆంధ్రజ్యోతి) : త్వరలోనే కొయ్యలగూడెంలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు. ఈ మేరకు సోమవారం కొయ్యలగూడెంలో ఆదివారం షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన కే.సుధీర్‌కుమార్ కుటుంబసభ్యులను ఆయన పరామర్శించారు. ఆదివారం ఉదయం ఏసీ వద్ద కరెంటు షార్ట్‌సర్క్యూట్ అయ్యి ఇంటిలోని సామగ్రి మొత్తం అగ్ని ప్రమాదంలో బూడిదయ్యాయి. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఇంటి పరిశీలించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కుటుంబానికి ప్రభుత్వం, పార్టీ నుంచి అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. ఈ ప్రాంతంలో లోఓల్టేజ్ లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.కొయ్యలగూడెం మండలానికి మంజూరైన అగ్నిమాపక కేంద్రాన్ని వారం రోజుల్లో శంకుస్థాపన చేస్తామని తెలిపారు. ఈయన వెంట జనసేన సీనియర్ నేతలు కరాటం ఉమా, గడ్డమనుగు రవికుమార్, మండల జనసేన అధ్యక్షుడు తోట రవి, పట్టణ జనసేన అధ్యక్షుడు మాదేపల్లి శ్రీను, పట్టణ టీడీపీ అధ్యక్షుడు జ్యేష్ఠ రామకృష్ణ, మద్దు తేజ, కోనా కుమార్ పాల్గొన్నారు.

భూములు అప్పగించే వరకు నిరాహార దీక్షను కొనసాగిస్తాం


కుటుంబ సమేతంగా ధర్నా చేస్తున్న బాధితుడు

బుట్టాయగూడెం, మే 5(ఆంధ్రజ్యోతి): తమ వ్యవసాయ భూమిలోని పంటను దౌర్జన్యంగా తరలించుకుపోవడాన్ని నిరసిస్తూ దళితుడు బాషా రంపాల రాజు కుటుంబంతో సహా స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరాహారదీక్షకు దిగాడు. తమపై దాడులు చేస్తూ పంటలను అపహరించుకుపోతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని భూములను అప్పగించాలని డిమాండ్ చేశాడు. బాధితుడు రాజు మాట్లాడుతూ మర్రిగూడెం గ్రామ రెవెన్యూ పరిధిలోని తనకు 23.36 ఎకరాల భూమి ఉందని ఈ భూమికి సంబంధించి అన్ని హక్కులు తమకే ఉన్నాయన్నారు. అయితే ఈ భూములు తమకే చెందుతాయంటూ మర్రిగూడేనికి చెందిన కొందరు గ్రామస్థులు తమపై కత్తులు, కర్రలతో దాడి చేస్తున్నారని వాపోయాడు. ఇప్పటికే మూడు సార్లు దౌర్జన్యం చేశారని అన్నారు. 2002, 2006లో రెవెన్యూ వారు పంచనామా చేసి భూములను అప్పగించడంతో సాగుచేసుకుంటున్నామన్నారు. అయితే ఆ భూముల్లో పంటను తరలించుకుపోతున్నారని, ఇదేమిటని ప్రశ్నిస్తే దాడులకు తెగబడుతున్నారని న్యాయం చేయాలని బాధితుడు అధికారులను కోరుతున్నాడు.

రాజ్యసభ సభ్యులు సత్యనారాయణకు సన్మానం


సత్యనారాయణను సన్మానిస్తున్న గౌడ సంఘం నాయకులు

ఏలూరు రూరల్, మే 5(ఆంధ్రజ్యోతి) : రాజ్యసభ సభ్యులుగా ధృవీకరణ పత్రాన్ని స్వీకరించిన పాకా సత్యనారాయణను ఏలూరు గౌడ సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో ఘనంగా సన్మానించారు. భవిష్యత్‌లో మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నేతలు ఉప్పాల జగదీశ్ బాబు, సూరిబాబు, వీరంకి పాండు, వీరమల్లు వెంకట సత్యనారాయణ, మొదుగుమూడి శివరామకృష్ణ, మార్గాని రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్, పీఎఫ్ వర్తింపజేయాలని వినతి

ఏలూరు సిటీ, మే 5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధీనంలో ఉన్న విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పెన్షన్, ఈపీఎఫ్ వర్తింపజేయాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్‌కు విద్యుత్ ఉద్యోగుల జీపీఎఫ్ సాధనా సమిత సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎంపీ క్యాంపు కార్యాలయంలో సమితి సభ్యులు మహేశ్ కుమార్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. తమ సమస్యను చట్టసభల్లో ప్రస్తావించి పరిష్కారానికి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ విద్యుత్ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత వరకు పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని వారికి భరోసా ఇచ్చారు.

8వ రోజుకు సీహెచ్‌వోల సమ్మె

ఏలూరు రూరల్, మే 5(ఆంధ్రజ్యోతి) : డిమాండ్ల సాధనకు వైద్య ఆరోగ్య శాఖలో ఎంహెచ్ఎం కింద పనిచేస్తున్న సీహెచ్‌వోలు చేపట్టిన సమ్మె సోమవారం 8వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు సిద్ధయ్య మాట్లాడుతూ రెండేళ్లుగా జీతభత్యాల విషయంలో ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు. ఆరేళ్లు దాటిన సీహెచ్‌వోలను క్రమబద్ధీకరించాలని, ఏటా 5 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో అసోసియేషన్ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఫ్రాన్సిస్‌కు సీపీఎం నేతల పరామర్శ

బుట్టాయగూడెం, మే 5(ఆంధ్రజ్యోతి) : కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అందుగుల ఫ్రాన్సిస్ తల్లి అందుగుల వెంకమ్మ మృతి చెందడంతో సోమవారం సీపీఎం జిల్లా నాయకులు ఆమె పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుమారుడు ఫ్రాన్సిస్‌ను ఎ.రవి, మొడియం నాగమణి, తెల్లం రామకృష్ణ, ఎ.శ్యామల రాణి, టి.ముత్యాలమ్మలు పరామర్శించి సానుభూతిని తెలిపారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి

ఉంగుటూరు, మే 5(ఆంధ్రజ్యోతి) :అకాల వర్షాలకు నష్టపోయిన రైతాంగాన్ని సోమవారం వైసీపీ బృందం పరిశీలించింది. ప్రతి గింజను రైతుల నుంచి కొనుగోలు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైసీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి గింజను కొంటామని నమ్మ బలికి టార్గెట్ పేరుతో కోతలు విధించడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో వైసీపీ ఇన్‌చార్జి మామిళ్ళపల్లి జయప్రకాశ్, కంభం విజయరాజు, పుప్పాల గోపి, ఆయా మండలాల కన్వీనరు మరడా మంగారావు, సత్తిబాబు, ఉంగుటూరు జడ్పీటీసీ భర్త కొరిపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రామ కమిటీలదే కీలకపాత్ర : చింతమనేని



పెదవేగి, మే 5 (ఆంధ్రజ్యోతి) : క్షేత్ర స్థాయిలో పార్టీ బలంగా ఉండాలంటే గ్రామ కమిటీలదే కీలక పాత్ర అని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం బాపిరాజు గూడెంలో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ కమిటీలను ఎంపిక చేశారు.బాపిరాజుగూడెం గ్రామాధ్యక్షునిగా మార్కండేయులు, ఉపాధ్యక్షునిగా పి.కొండలు, ప్రధాన కార్యదర్శిగా సుబ్బారావు, సహాయ కార్యదర్శులుగా అంకారావు, నాగరాజు, మహేష్‌తో పాటు కమిటీ సభ్యులను ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభాకర్ పార్టీ కార్యాలయంలో సమస్యలపై అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, గారపాటి రామసీత, మంచినేని శ్రీనివాస్, బాపిరాజు గూడెం గ్రామ సర్పంచ్ జోగి పెద్ద పెంటయ్య, తలకొండ జమలయ్య పాల్గొన్నారు.

ఘనంగా రావూరి కృష్ణ పుట్టిన రోజు వేడుకలు

జంగారెడ్డిగూడెం, మే 5(ఆంధ్రజ్యోతి) : చింతలపూడి నియోజకవర్గంలో త్వరలో ఒక పెద్ద ఇండస్ట్రీకి శంకుస్థాపన చేయబోతున్నామని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. సోమవారం టీడీపీ పట్టణాధ్యక్షుడు రావూరి కృష్ణ పుట్టినరోజు వేడుకల్లో ఎమ్మెల్యే రోషన్ కుమార్ పాల్గొని కృష్ణకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను రావూరి కృష్ణ కట్ చేశారు.

అంగన్వాడీ కేంద్రం నుంచి నీరు తోడివేత



ద్వారకాతిరుమల, మే 5(ఆంధ్రజ్యోతి): గత ఆదివారం కురి సిన వర్షానికి ఎం.నాగులపల్లిలోని అంగన్వాడీ కేంద్రంలోకి భారీగా వర్షపు నీరు వచ్చి చేరింది. సోమవారం నీరు తోడించిన తరువాత అంగన్వాడీ కేంద్రాన్ని నిర్వహించారు.


యజ్ఞశాలలో నిర్వహిస్తున్న రుద్రహోమం

ఘనంగా రుద్రహోమం

ద్వారకాతిరుమల, మే 5(ఆంధ్రజ్యోతి): క్షేత్రపాలకుడైన శివదేవుని ఆలయంలో సోమవారం రుద్రహోమం వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయ పరిసరాలను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. అనంతరం యజ్ఞశాలలో క్రతువును అర్చకులు ప్రారంభించారు. శాస్త్రోక్తంగా వేదమంత్రోచ్చరణల నడుమ జరిగిన ఈ యజ్ఞక్రతువు చూపరులను, భక్తులను అలరించింది. పలువురు భక్తులు శివయ్యను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరుపుకున్నారు.

సబ్సిడీపై దాణా పంపిణీ

బుట్టాయగూడెం, మే 5(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమీకృత దాణా పంపిణీ పథకంలో భాగంగా 50 శాతం సబ్సిడీపై పాడి రైతులకు పశువుల దాణాను సరఫరా చేస్తున్నట్టు పశు వైద్యాధికారి కె.విజయ కుమార్ తెలిపారు. 50 కేజీల బస్తా రూ.1,110 కాగా రాయితీపై రూ.555లకు అందజేస్తున్నట్టు తెలిపారు. ఆసక్తిగల రైతులు దగ్గరలోని రైతు సేవా కేంద్రం, పశు వైద్యశాలలో రైతు వాటా చెల్లించి దాణాను తీసుకెళ్లవచ్చని కుమార్ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్‌వైర్ చోరీ

బుట్టాయగూడెం, మే 5(ఆంధ్రజ్యోతి):వేపులపాడు గ్రామంలోని జోడె గంగమ్మకు చెందిన పొలంలో ట్రాన్స్ ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టి అందులోని కాపర్ వైర్‌ను దొంగిలించినట్టు విద్యుత్ ఏఈ శ్రీనివాసవర్మ తెలిపారు. ఈ మేరకు గంగమ్మ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. రెండు నెలల వ్యవధిలో నిర్వాసితుల కాలనీ, వేపులపాడు ప్రాంతాల్లో గుర్తు తెలియని వ్యక్తులు మూడు ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టి కాపర్ వైర్‌ను దొంగిలించినట్టు ఏఈ తెలిపారు. వరుస దొంగతనాలతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. దండగులట కట్టించాలని కోరుతున్నారు.

20న ఉపాధి పనులు బంద్

కుక్కునూరు, మే 5(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ చట్టానికి కేంద్ర బడ్జెట్ నిధులు, పని దినాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20వ ఉపాధి పనులు బంద్ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు వై.నాగేంద్రరావు పిలుపునిచ్చారు. సోమవారం చీరవల్లి, దామరచర్ల గ్రామాల్లో పని చేస్తున్న ఉపాధి పనుల ప్రాంతానికి వెళ్ళి కార్మికులకు అవగాహన కల్పించారు. రోజురోజుకి నిత్యవసరాల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ఉపాధి పని దినాలతో పాటు కూలీవేతనం కూడా పెంచాలని డిమాండ్ చేశారు. ఈ బంద్‌కు కార్మికులు మద్దతు పలకాలని కోరారు.

600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

కుక్కునూరు, మే 5(ఆంధ్రజ్యోతి): జిన్నెలగూడెం అటవీ ప్రాంతంలో సారా స్థావరాలపై దాడి చేసి 600లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి, ఐదు లీటర్ల సారాను జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. బెల్లపుఊటను ధ్వంసం చేసి సారా తయారీదారులపై కేసులు నమోదు చేశారు. ఈ దాడిలో ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాల వాహనాలు స్వాధీనం

భీమడోలు, మే 5(ఆంధ్రజ్యోతి) : కోళ్ల వ్యర్థాలను చేపల చెరువులకు తరలిస్తున్న రెండు వాహనాలను భీమడోలు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గ్రామస్థులు ఇచ్చిన సమాచారం మేరకు భీమడోలు శివారు లింగంపాడు చేపల చెరువులకు తరలిస్తున్న రెండు వాహనాలను భీమడోలు పోలీసులు అడ్డుకున్నారు. పెదపాడుకు చెందిన గండికోట వినయ్ తదితరులు, హైదరాబాద్ నుంచి సేకరించి సుమారు 15 టన్నుల కోళ్ల వ్యర్థాలను లింగంపాడు చేపల చెరువుకు తరలిస్తుండగా పట్టుకున్నారు. వ్యర్థాలను పూడ్చివేసి, వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

సీఎం సహాయ నిధి అందజేత

ఉంగుటూరు,మే 5(ఆంధ్రజ్యోతి) : ఆర్థికంగా దెబ్బతిన్న ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే ధర్మరాజు అన్నారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలో 19 మంది లబ్ధిదారులకు చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

చింతలపూడి, మే 5(ఆంధ్రజ్యోతి) : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కొత్త బస్టాండ్‌లో సోమవారం చలివేంద్రం ప్రారంభించారు. వేసవిలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్టు డాక్టర్ ఎ.సత్యనారాయణ, ఎ.అప్పారావు తెలిపారు. కార్యక్రమంలో విశ్వేశ్వరరావు, ఎ.రాజారావు, నాగ చిన్నారావు, ఎం.శామ్యూల్, ఆర్టీసీ కంట్రోలర్ ఆర్.ఎస్.నారాయణ పాల్గొన్నారు.

ఘనంగా శేషు పుట్టిన రోజు వేడుకలు

జంగారెడ్డిగూడెం, మే 5(ఆంధ్రజ్యోతి) : టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, అఖిల భారత గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి శ్యామ్ చంద్రశేషు పుట్టిన రోజు వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కుక్కల మాధవరావు ఆధ్వర్యంలో వేగవరంలో కేక్ కట్ చేశారు. పట్టణంలో అమ్మ ప్రేమ ఆశ్రమంలో పిల్లల ప్రత్యేకంగా భోజనాలు ఏర్పాట్లు చేశారు.

తాగునీటి చెరువుల్లో క్లోరినేషన్ చేయాలి

కలిదిండి మే 5 (ఆంధ్రజ్యోతి): నీటితో నింపిన చెరువుల్లో క్లోరినేషన్ చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈలు కృష్ణారావు, అజయ్ అన్నారు. సోమవారం లంక గ్రామాల్లో నీటితో నింపిన చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి దృష్ట్యా తాగునీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. పైపులైన్ల లీకేజీలను అరికట్టాలన్నారు. పబ్లిక్ కుళాయిలకు హెడ్‌లు బిగించాలన్నారు. చెరువుల్లో బ్లీచింగ్ తప్పనిసరిగా చల్లించే విధంగా సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు.

నేడు టీడీపీ కుటుంబ సాధికార సారథుల సమావేశం

కైకలూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కుటుంబ సాధికార సారథుల కార్యక్రమాన్ని మంత్రి కొలుసు పార్థసారథి ప్రారంభించనున్నట్లు నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు తెలిపారు. మంగళవారం సాయంత్రం 3 గంటలకు కైకలూరు సీతారామఫంక్షన్ హాలులో మంత్రి సారథి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలుగుదేశంపార్టీ కుటుంబసభ్యులంతా పెద్దఎత్తున పాల్గొనాలన్నారు.


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ లక్ష్మీ రామకృష్ణ

పెదలంకలో క్రికెట్ పోటీలు ప్రారంభం

కలిదిండి మే 5 (ఆంధ్రజ్యోతి): పెదలంకలో సోమవారం క్రికెట్ పోటీలను సర్పంచ్ మోకా రామకృష్ణ, వెలమ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు అక్కల వెంకటాచలం ప్రారంభించారు. ప్రథమ బహుమతి లక్ష రూపాయలు, ద్వితీయ బహుమతి రూ.50 వేలు, తృతీయ బహుమతి రూ.25 వేలు నగదుతోపాటు షీల్డులను విజేతలకు అందజేస్తామన్నారు.

ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారం


తల్లిదండ్రులతో మాట్లాడుతున్న టీచర్లు

చాట్రాయి, మే 5 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్యను అందిస్తూ, ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న తమ హైస్కూల్‌లో పిల్లల్ని చేర్పిస్తే వారి భవిష్యత్‌కు బంగారు బాట వేస్తామని ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు హామీ ఇస్తున్నారు. మండలంలోని మర్లపాలెం జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఎ.బక్కయ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సోమవారం మర్లపాలెం, సోమవరం, కొత్తగూడెం, యర్రావారిగూడెం తదితర గ్రామాలలో తల్లిదండ్రుల ఇళ్లకు వెళ్లి వారితో మాట్లాడి విద్యార్థులను హైస్కూల్‌లో జాయిన్ చేసుకున్నారు.


కథల పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

పుస్తక పఠనంతో విజ్ఞానం

చాట్రాయి, మే 5(ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో విద్యార్థులలో విజ్ఞానం పెరిగి చదువులో గొప్పగా రాణిస్తారని చనుబండ గ్రంథాలయం లైబ్రేరియన్ శ్రీకాంత్ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాలలో భాగంగా చనుబండ గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించారు. స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలు, బ్రిటీష్ తెల్ల దొరలకు వ్యతిరేకంగా వారు సాగించిన పోరాటాలు, స్వాతంత్ర్యానంతరం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు దేశాభివృద్ధికి, పేదలు, దళితుల సామాజిక అభివృద్ధికి తీసుకున్న చర్యల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులతో క్యారమ్స్ ఆడించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని గాయాలు


గాయపడిన పవన్‌కుమార్

ఆగిరిపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని ద్విచక్రవాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన ఆగిరిపల్లి మండలం, నెక్కలంగొల్లగూడెం వద్ద సోమవారం జరిగింది. ఆగిరిపల్లి మండలం, చొప్పరమెట్ల గ్రామానికి చెందిన పామర్తి పవన్‌కుమార్ (20) విజయవాడ వెళుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన పవన్‌కుమార్‌ను విజయవాడ హాస్పిటల్‌కి తరలించారు.

పాస్టర్‌పై కర్రతో దాడి

ముదినేపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి):ముదినేపల్లి మండలం ములకలపల్లి గ్రామంలో దంపతుల మధ్య ఏర్పడిన వివాదం చివరికి కొట్లాటకు దారి తీసింది. ఆ గ్రామానికి చెందిన పోతురాజు అనే వ్యక్తికి అతని భార్యకు తగాదా ఏర్పడి ఘర్షణ పడుతున్న సమయంలో ఆదివారం సాయంత్రం అటుగా వెళ్తున్న పాస్టర్ బాబూరావు భార్యాభర్తలను వారించబోయాడు. ఆ పరిస్థితుల్లో వివాదం పెద్దదై బాబూరావును పోతురాజు కర్రతో కొట్టి గాయపర్చాడు. గాయాలతో పాస్టర్ బాబూరావు గుడివాడ ప్రభుత్వాసుపత్రిలో చేరగా, అక్కడి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఆదివారం రాత్రి కేసు నమోదు చేసి ఎస్‌ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.


నాయకుల విశేషాలను వివరిస్తున్న టీచర్ సూర్యనారాయణ మూర్తి

జాతీయ నాయకుల ఆశయాలపై బోధన

ముదినేపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలోని శాఖా గ్రంథాలయంలో స్థానిక పాఠశాల ఉపాధ్యాయుడు పసుమర్తి సూర్యనారాయణ మూర్తి జాతీయ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలను విద్యార్థులకు వివరించారు. ముఖ్యంగా దేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ బాల్యం నుంచి చివరి వరకు వివరించారు. జాతీయ నాయకుల ఆశయాలను నేటి బాలలు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రంథాలయాధికారిణి ఎం.శ్రీదేవి విద్యార్థులకు నీతి కథలను బోధించారు.


ఆటపాకలో డ్రెయిన్ తవ్వకాలు చేస్తున్న దృశ్యం

మురుగునీటి పారుదలకు చర్యలు

కైకలూరు, మే 5(ఆంధ్రజ్యోతి): డ్రెయిన్ల ప్రక్షాళనతో ముంపు నివారణ చర్యలు చేపడుతున్నట్లు పంచాయతీ కార్యదర్శి జి.రవి కిరణ్ తెలిపారు. సోమవారం కైకలూరు మండలం ఆటపాక గ్రామంలో జాతీయ రహదారి వెంబడి డ్రెయిన్ ఆక్రమణలను తొలగించారు. డ్రెయిన్ల నీటి పారుదలకు అడ్డుగా ఉన్నవాటిని ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. నివాసగృహాల ముందు నీటిపారుదలకు అవరోధం లేకుండా ర్యాంపులు నిర్మాణం చేసుకోవాలని కార్యదర్శి సూచించారు. చిన్నచిన్న తూములు ఏర్పాటు చేయడం వలన డ్రెయిన్ల మురుగునీరు పారుదల కాక నిల్వ ఉండి దోమలు విజృంభిస్తున్నాయన్నారు.

గ్రామాల్లో అంధకారం

నెలలు తరబడి వెలుగని వీధిలైట్లు


చింతలవల్లిలో వెలగని వీధిలైటు

మునునూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో పాలన రోజురోజుకు కుంటుపడుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల వ్యాప్తంగా 16 పంచాయతీల్లో పలు కాలనీల్లో నెలలు తరబడి వీధిలైట్లు వెలగకపోవడంతో గ్రామాల్లో అంధకారం నెలకొంది. పాలకులు, అధికారులు సైతం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చింతలవల్లి పంచాయతీలో ఏస్సీ, బీసీ కాలనీలతోపాటు ప్రధాన రహదారి వెంట సైతం వీధిలైట్లు వెలగక ఐదు నెలలు గడుస్తున్నా పట్టించుకున్న నాథుడే లేడని స్థానికులు అంటున్నారు. మెయిన్ రోడ్డు పక్కన విద్యుత్ స్తంభాలకు ఉన్న వీధిలైట్లను మరమ్మతు నిమిత్తం సర్పంచ్ తొలిగించి నెలలు గడుస్తున్న నేటిని వాటి జాడలేదు. అయితే ఈ పంచాయతీలో కార్యాదర్శి, సర్పంచ్ మధ్య బిల్లులు చెల్లింపుల్లో వివాదం నడుస్తోందని సమాచారం. వీరిద్దరి మధ్య వివాదం కస్తా గ్రామాన్ని అంధకారంలోకి నెట్టింది. రమణక్కపేట, మునునూరు, గోపవరం, చెక్కపల్లి, వేల్పుచర్ల, గుళ్ళపూడి, లోపూడి, కొర్లకుంట, కాట్రేనిపాడు, వలసపల్లి తదితర గ్రామ పంచాయతీల్లో పలు కాలనీల్లో వీధిలైట్లు వెలగక రాత్రి సమయాల్లో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలల కాలంలో పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఆర్థిక సంఘాల నుంచి లక్షలాది రూపాయలు విడుదల చేసిందని, అధికారులు, పాలకులు మాత్రం నిధులు ఉన్నా వీధిలైట్లు కూడా వేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడు తున్నారు.

ఎన్‌టీఎన్‌ఎల్ పరీక్షలకు పదివేల మంది ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు

నూజివీడు టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల్లో శాస్త్ర సాంకేతిక రంగంలో మెళకువలు పెంచే దిశగా నేషనల్ ప్రోగ్రామ్ ఆన్ టెక్నాలజీ ఎన్‌హాన్స్‌డ్ లెర్నింగ్ పై 10,300మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఎస్.అమరేంద్రకుమార్ తెలిపారు. ఐఐటీలు, ఐఐఎస్‌సీ లాంటి దేశవాళి, ప్రతిష్టాత్మక విద్యాసంస్థల భాగస్వామ్యంతో భారత మానవవనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేషనల్ ప్రోగ్రామ్ ఆన్ టెక్నాలజీ ఎన్‌హాన్స్‌డ్ లెర్నింగ్ పరీక్షలకు ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, శ్రీకాకుళం, ఆర్కేవ్యాలీ, ఒంగోలు క్యాంపస్‌ల నుంచి తృతీయ, ఆఖరి సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు అయ్యారన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించటానికి రూపొందించిన ఈ కోర్సులు ప్రత్యేకమని ఇలాంటి మరిన్ని కోర్సులను వచ్చే విద్యాసంవత్సరం నుంచి విద్యార్థులకు అందుబాటులో ఉంచనున్నట్లు ఆయన తెలిపారు.


పరీక్షలు రాస్తున్న విద్యార్థులు


చెరువును తలపిస్తున్న మట్టగుంట - పెదలంక రహదారి

అధ్వానంగా మట్టగుంట - పెదలంక రహదారి

కలిదిండి మే 5 (ఆంధ్రజ్యోతి): మట్టగుంట - పెదలంక ప్రధాన రహదారిపై పెద్ద గోతులు పడి సుమారు 4 కిలోమీటర్ల మేర అధ్వానంగా ఉంది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. గోతుల్లో వాహనాలు దిగబడటంతో గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోతోంది. నిత్యం ఈ రహదారిపై కొండంగి, యడవల్లి, మట్టగుంట, బొడ్డువానిగట్టు, పెదలంక, అప్పారావుపేట, పెదపుట్లపూడి గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అకాల వర్షాలకు రహదారిపై ఉన్న గుంతల్లో నీరు చేరటంతో చెరువులను తలపిస్తున్నాయి. ద్విచక్ర వాహన చోదకులు గోతుల్లో పడి క్షతగాత్రులవుతున్నారు. కొద్దిపాటి వర్షానికే రహదారి చెరువును తలపించటంతో ఈ రహదారిపై ప్రయాణం చేయటానికి నరకయాతన పడుతున్నారు. చేపలు, రొయ్యల చెరువులు రహదారికి ఇరువైపులా ఉండటంతో చేపలు, రొయ్యలను వాహనాల్లో ఎగుమతులు దిగుమతులు చేసుకోవటానికి రైతులు అవస్థలు పడుతున్నారు. లోడు వాహనాలు గోతుల్లో ఇర్కుపోతున్నాయని వాపోతున్నారు. రహదారికి మరమ్మతులు చేయాలని ఐదేళ్లుగా అధికారులకు విన్నవించినప్పటికీ పట్టించుకోవటం లేదని ప్రజలు ఆరోపిస్తుఆన్నరు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి మట్టగుంట, పెదలంక రహదారి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

జలజీవన్ మిషన్ పనులు పూర్తి చేయాలి


వినతి పత్రం అందచేస్తున్న ఎల్ఎస్ భాస్కరరావు

మండవల్లి, మే 5(ఆంధ్రజ్యోతి): మండవల్లిలో జలజీవన్ మిషన్ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఇచ్చి రక్షిత తాగునీరు అందించాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.ఎస్.భాస్కరరావు, జిల్లా కన్వీనర్ అప్పారావు కోరారు. మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమంలో ఎంఆర్‌వో గోపాల్, ఎంపీడీవో రామలింగేశ్వరరావులకు వినతిపత్రం అందజేశారు.



తమ్మగూడెంలో ప్రజలతో పోలీస్ అధికారులు

వేసవిలో దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి

చాట్రాయి, మే 5 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో గ్రామాల్లో దొంగతనాలు జరక్కుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానస్పద వ్యక్తులు కన్పిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని నూజివీడు రూరల్ సీఐ కె.రామకృష్ణ, చాట్రాయి ఎస్ఐ డి.రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. మండలంలోని తుమ్మగూడెం గ్రామంలో సోమవారం సాయంత్రం పోలీస్ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ ప్రజల భద్రతకు పోలీస్‌శాఖ నిరంతరం పనిచేస్తున్నదని, ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ మెస్సేజ్‌లు నమ్మవద్దన్నారు. క్రికెట్ బెట్టింగులు జూదాలకు దూరంగా ఉండాలని ఇవి వ్యక్తిగత కుటుంబ ఆర్థిక పరిస్థితులను దిగజారుస్తాయని హెచ్చరించారు. నేరాల నివారణ, భద్రత కోసం సీసీ కెమేరాలు ఏర్పాటు చేసుకోవాలని గ్రామస్థులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మండలపు రాజారావు, మాదల నరసింహారావు మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	124, 133, 144
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244



నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475


న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి వీవీఎన్‌వి లక్ష్మీ

పేదలకు చట్టాలపై అవగాహన ఉండాలి

కైకలూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఉచితంగా న్యాయసేవలు అందించబడతాయని సీనియర్ సివిల్‌జడ్జి వీవీఎన్‌వి లక్ష్మీ అన్నారు. సోమవారం కైకలూరు లేబర్ కార్యాలయంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రపంచ కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ఎక్కడైనా అన్యాయం జరిగితే పేదలు కోర్టు ఖర్చులు బరాయించలేకపోతే మండల లీగల్‌సెల్‌సర్వీస్ ద్వారా ఉచితంగా న్యాయసేవలందించబడతాయన్నారు. పేదల కోసం అనేకరకాల చట్టాలున్నాయని వాటిపట్ల అవగాహనతో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పి.పవన్‌కాంత్, డి.శివప్రసాద్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎస్ దుర్గారావు, బీఎంఎస్ నాయకులు యానాల బసవయ్య, టాపీ వర్కర్స్‌యూనియన్ నాయకుడు కె.సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం


మాట్లాడుతున్న నబీద్‌అహ్మద్

నూజివీడు టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఎడ్యుకేషన్ ప్రతినిధి నబీద్‌అహ్మద్ మాట్లాడుతూ ప్రతి అధ్యాపకుడు నిత్య విద్యార్థిగా సాంకేతిక అంశాలను నేర్చుకుంటూ విద్యార్థులకు బోధించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, నూజివీడు క్యాంపస్ డైరెక్టర్ అమరేంద్ర కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా కోర్సులను పాఠ్యాంశాల్లో చేర్పించాల్సిన ఆవశ్యకత ఉందని, ఇందులో భాగంగానే ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ పి.శ్యామ్, రీయాజ్‌హుస్సేన్, నాగార్జునాదేవి తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న గోవిందరావు

నూజివీడు టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పెన్షనరీ రివైజనరీ రూల్స్ బిల్లు వల్ల పెన్షనర్లు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని, కేంద్రప్రభుత్వం పెన్షనర్లను ఆదుకునే దిశగా చర్యలు చేపట్టాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గోవిందరావు కోరారు. నూజివీడులో అసోసియేషన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విషయమై రాష్ట్రముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఈమని శేషయ్య, కార్యదర్శి సోమయాజులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ అబ్దుల్ ఖాదర్, ట్రెజరర్ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ మాజీ అధ్యక్షుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మునునూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): మును నూరు మాజీ సొసైటీ అధ్యక్షులు మానికల శ్రీనివాసరావు కుటుంబానికి యువకులు ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల శ్రీనివాసరావు అనారోగ్యంతో మృతి చెందాడు. ప్రస్తుతం కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నేపథ్యంలో మానికల గంగధరరావు ఆధ్వర్యంలో సన్నిహితుల నుంచి సేకరించిన రూ.70వేలు నగదును సోమవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. మానికల పంగిడేశ్వరావు పాల్గొన్నారు.

చిన వెంకన్న సన్నిధిలో బుల్లితెర నటి సుహాసిని



ద్వారకాతిరుమల, మే 5(ఆంధ్రజ్యోతి): నటనతో పాటు అదృష్టం కలిసివస్తేనే చలనచిత్ర రంగంలో రాణిస్తారని చలనచిత్ర, బుల్లితెర నటి సుహాసిని అన్నారు. చిన వెంకన్న ఆలయాన్ని సోమవారం ఆమెసం దర్శించారు. స్వామి, అమ్మవార్లను దర్శిం చుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆమెను గుర్తించిన పలువురు భక్తులు ఆమెతో ఫొటో లు దిగారు. 2003లో బిజయ దర్శకత్వంలో రూపొందిన చంటి సినిమాతో చలన చిత్ర రంగప్రవేశం చేసినట్లు చెప్పారు. ఆతరువాత తెలుగు, తమిళ, కన్నడ సినిమాల్లో నటిం చానన్నారు. ఆ తరువాత తెలుగు, తమిళ బుల్లితెర సీరియల్స్‌లో నటించానన్నారు. 2010లో అపరంజి ధారావాహిక ద్వారా బుల్లితెరలో ప్రవేశించి ఎన్నో హిట్ సీరియల్స్ చేసినట్లు చెప్పారు.

పశువులకు దాహం

- నీటి తొట్టెల నిర్మాణంపై నిర్లక్ష్యం
- ముదినేపల్లి మండలంలో ముందుకు సాగని పనులు


సింగరాయపాలెంలో నిర్మాణం పూర్తయిన పశువుల తాగునీటి తొట్టె

ముదినేపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన పశువుల తాగునీటి తొట్టెల నిర్మాణం ముదినేపల్లి మండలంలో ముందుకు సాగటం లేదు. మండలంలో 9 నీటి తొట్టెల నిర్మాణం చేపట్టాలని పశు సంవర్ధక శాఖ ప్రతిపాదించగా, నెలరోజులుగా ఒక్క నీటి తొట్టె నిర్మాణం మాత్రమే పూర్తయింది. మండలంలోని పెదపాలపర్రు, పెయ్యేరు, కోడూరు, వైవాక, విశ్వనాద్రిపాలెం, పెదగొన్నూరు, సింగరాయపాలెం, శ్రీహరిపురం, కోమర్రు గ్రామాల్లో పశువులకు తాగునీటి తొట్టెల నిర్మాణం చేపట్టేందుకు ఈ ఏడాది మార్చి నెలాఖరులో తీసుకున్న నిర్ణయాలు అమ లుకు నోచుకోలేదు. కొన్ని పంచాయతీల్లో నీటి తొట్టెల నిర్మాణానికి తీర్మానాలే ఖరారు కాలేదు. ఒక పంచాయతీలో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారే కానీ ఇంకా పూర్తి కాలేదు. రెండు పంచాయతీల్లో స్థలాల నిర్ధారణ కాలేదని తెలిసింది. ఒక్క సింగరాయపాలెం గ్రామంలోని ఈ నీటి తొట్టె నిర్మాణం పూర్తయింది. గ్రామపంచాయతీ నీటి తొట్టెకు వాటర్ పైపును కూడ ఏర్పాటు చేసింది. ఈ నీటి తొట్టెల నిర్మాణ ప్రక్రియ చిన్నదైనా మూడు శాఖల ప్రమేయం ఉండటంవతో పనులు వేగంగా జరగటం లేదు. తొలుత నీటి తొట్టెల నిర్మాణానికి పశుసంవర్థక శాఖ అధికారులు గ్రామాలను ఎంపిక చేయాలి. ఆయా గ్రామాల్లో తొట్టెల నిర్మాణానికి స్థలాన్ని ఎంపిక చేస్తూ గ్రామపంచాయతీ తీర్మానం చేయాలి. ఆ స్థలంలో ఉపాధి హామీ శాఖ అధికారులు నీటి తొట్టెలను నిర్మాణం చేపట్టాలి. ఈ ప్రక్రి యలో మండలంలో పశు సంవర్ధక శాఖ అధికారులు గ్రామాలను ఎంపిక చేయటం వరకు పూర్తయినా, స్థలాలను నిర్ధారణ చేయటంలో జాప్యం జరగటంతో ఉపాధి సిబ్బంది పనులను చేపట్టలేక పోయారు. వేసవిలో పశువుల దాహార్తిని తీర్చేందుకు తలపెట్టినీ తాగునీటి తొట్టె ల నిర్మాణం లక్ష్యమే దెబ్బతినే పరిస్థితి కనిపిస్తున్నది. వేసవి ముదురుతున్న నేపథ్యంలో నీటి తొట్టెల నిర్మాణం పూర్త వుతుందా? లేదా అన్నది ప్రశ్నార్థకంగా ఉంది.


గోనెలవాగుపై ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

ప్రమాదకరంగా గోనెలవాగు కల్వర్టు

చాట్రాయి, మే 5(ఆంధ్రజ్యోతి): విస్సన్నపేట-వెలగలపల్లి ఆర్‌అండ్‌బీ రహదారి(వివిరోడ్డు) పరిధిలో పోలవరం, మంకొల్లు గ్రామాల మధ్య గొనెలవాగుపై ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా ఉంది. సుమారు 50 ఏళ్ళ క్రితం నిర్మించిన ఈ కల్వర్టు శిథిలావస్థకు చేరింది. ఇది ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల మధ్య రహదారి కావటంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కల్వర్టు బాగా లోలెవెల్‌లో ఉండగా, ఇరువైపుల రోడ్లు ఎత్తులో ఉన్నాయి. ఇది సింగిల్ లేన్ కల్వర్టు కావటంతో ఎదైనా వాహనం ఎదురుగా వచ్చి పక్కకు తప్పుకుంటే అంతే సంగతులు వాగులో పడిపోయే ప్రమాదం ఉంది. ఇక్కడ ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన కల్వర్టు స్థానంలో డబుల్ లేన్ కల్వర్టు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.